


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 10-02-2026 | సంపుటి - 26 | సంచిక -262 | రూ : 4 | పేజీలు: 8


# పంపకాలే పంపకాలు

- ముగిసిన ఎన్నికల ప్రచారం
- చివరి రోజు హాట్ హాట్ కామెంట్లు
- మూడు రోజుల ముందు నుంచే మొదలైన పంపకాలు
- ఇప్పటికే ప్రతిపక్ష పార్టీల పంపకాలు చాలా వరకు పూర్తి
- మొదలైన అధికార పార్టీ తాయిలాల ఎర
- రూ.1500 నుంచి మొదలు... ప్రతిష్ఠాత్మకమైన చోట రూ. 5 వేల వరకు...
- అండర్ కోర్ ఆపరేషన్ లో ముఖ్య నేతలు... మారుతున్న సమీకరణాలు
- పోలింగ్‌కు అధికారులు ఏర్పాట్లు

2లో


## సైబర్ దోపిడీ ద్వారా రూ.54 వేల కోట్లు..
# స్వాహాపై సుప్రీం ఆగ్రహం

- హైదరాబాద్‌లోని ఫోరెన్సిక్ ల్యాబ్‌లో అగ్నిప్రమాదం
- ‘ఓటుకు నోటు’ కేసు ఆధారాలు కాలిపోయాయన్నది అసత్యం
- సాక్ష్యాలన్నీ 2021లోనే కోర్టుకు ఇచ్చామన్న డైరెక్టర్ శిఖా గోయల్
- ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించిన మెటీరియల్స్ కూడా సురక్షితం
- కొన్ని డాక్యుమెంట్లు మాత్రమే కాలిపోయాయని, డేటాకు నష్టం లేదని స్పష్టీకరణ



2లో

## క్షేత్రస్థాయిలో పర్యటించండి..
### విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు



2లో




2లో

## పీఎఫ్ డబ్బులు
# ఇక యూపీఐతోనే..
## ఏప్రిల్ నుంచి కొత్త సేవలు!

- యూపీఐ ద్వారా పీఎఫ్ డబ్బులు విత్‌డ్రా చేసుకునేందుకు కొత్త మొబైల్ యాప్
- ఈ ఏడాది ఏప్రిల్ నాటికి ఈ సేవలను అందుబాటులోకి తేనున్న ఈపీఎఫ్ఓ

## ఆ నిధులపై లోక్‌సభలో
# ప్రశ్నలకు నో

- పీఎం-కేర్స్, పీఎం ఎన్ఆర్ఎఫ్, ఎన్‌డీఎఫ్‌లపై పీఎంఓ : లోక్‌సభ సెక్రెటేరియట్‌కు ప్రధానమంత్రి కార్యాలయం వెల్లడి
- నిబంధనలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవచ్చని స్పష్టీకరణ




2లో



2లో

## బీసీసీఐ వార్షిక కాంట్రాక్టులు..
# విరాట్, రోహిత్‌లకు షాక్


విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలను గ్రేడ్ ‘బీ’కి పరిమితం చేసిన బోర్డు

## మోదీ కచ్చితంగా బడాబాయే..
### టీన్యూస్ జర్నలిస్టు ముఖంలో కేసీఆర్‌ను చూడలేను కదా

- ఆయన దేశానికి ప్రధానమంత్రి కాబట్టి బడాబాయే అన్న రేవంత్ రెడ్డి
- బీఆర్ఎస్ నాయకులు ఇష్టారీతిన మాట్లాడుతున్నారని ఆగ్రహం
- ఈగిల్ టీమ్‌కు చెప్పవలసి వస్తుందేమోనన్న ముఖ్యమంత్రి

2లో





2లో

## అన్నమయ్య జిల్లాలో బర్డ్ ఫ్లూ కలకలం..
# 24 వేల కోళ్ల మృతి

- సదుం మండలంలోని మూడు గ్రామాల్లో 24 వేల కోళ్ల మృతి
- భోపాల్ ల్యాబ్ పరీక్షల్లో వైరస్‌గా నిర్ధారించిన అధికారులు
- ప్రభావిత గ్రామాల్లో అప్రమత్తమైన అధికార యంత్రాంగం
- ఆందోళన వద్దు, జాగ్రత్తలు పాటించాలన్న నిపుణులు

### బీసీసీఐ వార్షిక కాంట్రాక్టులు..
# విరాట్, రోహిత్‌లకు షాక్

ఢిల్లీ: బీసీసీఐ 2025-26 సీజన్‌కు సంబంధించిన వార్షిక ఆటగాళ్ల కాంట్రాక్టుల జాబితాను సోమవారం విడుదల చేసింది. ఈ కొత్త జాబితాలో టీమిండియా సీనియర్ స్టార్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ గ్రేడ్ 'బీ'కి పడిపోవడం సంచలనంగా మారింది. ప్రస్తుత కెప్టెన్ శుభ్‌మన్ గిల్, సీనియర్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా, ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా అగ్రశ్రేణి గ్రేడ్‌లో తమ స్థానాలను నిలబెట్టుకున్నారు. టెస్టులు, టీ20 ఫార్మాట్ల నుంచి వైదొలగి కేవలం వన్డే క్రికెట్‌కు మాత్రమే పరిమితమైన కారణంగా కోహ్లీ, రోహిత్‌లను గ్రేడ్ 'బీ'కి మార్చినట్టు తెలుస్తోంది. ఈ ఇద్దరు ఆటగాళ్లు ప్రస్తుతం వచ్చే ఏడాది దక్షిణాఫ్రికా, జింబాబ్వే వేదికగా జరిగే ఐసీసీ వన్డే ప్రపంచకప్‌పై దృష్టి సారించారు. గత ఏడాది గ్రేడ్ 'ఏ'కి ప్రమోషన్ పొందిన ప్రస్తుత కెప్టెన్ శుభ్‌మన్ గిల్.. ఈసారి కూడా బుమ్రా, జడేజాలతో కలిసి అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. మరోవైపు, కోహ్లీ, రోహిత్‌లతో పాటు టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, వికెట్ కీపర్లు కేఎల్ రాహుల్, రిషభ్ పంత్, శ్రేయస్ అయ్యర్ సహా మొత్తం 11 మంది ఆటగాళ్లు గ్రేడ్ 'బీ'లో ఉన్నారు. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న టీ20 ప్రపంచకప్ 2026 జరుగుతున్న సమయంలో బీసీసీఐ ఈ కాంట్రాక్టులను ప్రకటించడం గమనార్హం. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన భారత్, ఇప్పటికే తన తొలి మ్యాచ్‌లో యూఎస్‌ఏపై విజయం సాధించింది.

### మోదీ కచ్చితంగా బడాబాయే..
# టీన్యూస్ జర్నలిస్టు ముఖంలో కేసీఆర్‌ను చూడలేను కదా

హైదరాబాద్: నరేంద్ర మోదీ దేశానికి ప్రధానమంత్రి కాబట్టి ఆయన కచ్చితంగా బడాబాయినే అని, ముఖ్యమంత్రి చోటాబాయి అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీని బడాబాయి అన్నారు కదా అని ఒక మీడియా ప్రతినిధి ప్రశ్నించగా, ముఖ్యమంత్రి స్పందించారు. ప్రధాని కాబట్టి ఆయన బడాబాయే అని చెప్పారు. ఇంగ్లీష్‌లో బిగ్ బ్రదర్ అంటారని, తాను హిందీలో చెప్పానని అన్నారు. 'మీరు టీ న్యూస్ జర్నలిస్టు అయినంత మాత్రాన మీ ముఖంలో నేను కేసీఆర్‌ను చూడను కదా. జర్నలిస్టుగానే చూస్తాను. అలాగే ప్రధానిని ప్రధానిగానే చూస్తాను.. ఆయన పెద్దన్నే' అని అన్నారు. మీ సారంతా ఇంగ్లీష్ నాకు రాదంటూ టీన్యూస్ జర్నలిస్టును ఉద్దేశించి ముఖ్యమంత్రి సరదాగా అన్నారు.

**ఈగల్ టీమ్‌కు చెప్పాలేమో**

పదేళ్లు తెలంగాణను పాలించిన బీఆర్ఎస్ చేసిందేమీ లేదని రేవంత్ రెడ్డి విమర్శించారు. ఈ పదేళ్లు నిధులు, అధికారం వారి చేతిలోనే ఉందని, అప్పుడేం చేశారని ప్రశ్నించారు. ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లో గెలిపించాలని రావడం విడ్డూరంగా ఉందని అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావుల చేతుల్లోనే కీలక శాఖలు ఉన్నాయని గుర్తు చేశారు. వారు ఏ ఒక్క వర్గానికీ న్యాయం చేయలేదని అన్నారు. బీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తే వచ్చేదేమీ లేదని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన కేసీఆర్ ఇప్పటి వరకు సభకు రాలేదని, ఇప్పుడు వార్డుల్లో బీఆర్ఎస్ వారిని గెలిపిస్తే వారు అభివద్ధిని అడ్డుకుంటారని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకుల్లో అహంకారం, విషం చిమ్మడం, విద్వేషపూరిత ప్రసంగాలు, రెచ్చగొట్టే మాటలు తప్ప ఏమీ లేదని అన్నారు. వారు స్థాయి మరిచి మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ముఖ్య నాయకులు ఇష్టారీతిన మాట్లాడుతున్నారని, చూస్తుంటే వారి గురించి ఈగల్ టీమ్ గురించి చెప్పాలేమోనని అన్నారు.

### సైబర్ దోపిడీ ద్వారా
# రూ.54 వేల కోట్లు స్వాహాపై సుప్రీం ఆగ్రహం

న్యూఢిల్లీ : సైబర్ దోపిడీ (డిజిటల్ మోసాల) ద్వారా రూ.54 వేలకోట్లకు పైగా స్వాహా కావడంపై సుప్రీంకోర్టు సోమవారం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది 'దోపిడీ, దొంగతనం'గా అభివర్ణించింది. సైబర్ మోసాలపై ఆర్బీఐ, బ్యాంకులు, టెలీకమ్యూనికేషన్ శాఖ (డీఓటీ)తో సంప్రదించి నాలుగు వారాల్లోగా ప్రామాణిక ఆపరేటింగ్ (ఎస్ఓటీ) ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించాల్సిందిగా కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. పలు చిన్న రాష్ట్రాల బడ్జెట్ల మొత్తం కన్నా డిజిటల్ మోసం ద్వారా స్వాధీనం చేసిన నగదు ఎక్కువని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోమాల్య బాగ్చి, జస్టిస్ ఎన్‌వి అంజరియాతో కూడిన ధర్మాసనం తెలిపింది. బ్యాంకు అధికారుల కుట్ర లేదా నిర్లక్ష్యం కారణంగా ఇటువంటి నేరాలు జరగవచ్చని వివరించింది. ఆర్బీఐ, బ్యాంకుల నుంచి సకాలంలో చర్యలు అవసరమని సూచించింది. ఆర్బీఐ, టెలికాం శాఖ (డీఓటీ) సూచనలు, ప్రామాణిక ఆపరేటింగ్ విధానాలను పరిగణనలోకి తీసుకుని నాలుగు వారాల్లోగా ముసాయిదా అవగాహన ఒప్పందాన్ని రూపొందించాలని హోంశాఖను ఆదేశించింది. సైబర్ ఆధారిత మోసాలను నిరోధించడానికి డెబిట్ కార్డులను తాత్కాలికంగా నిలిపివేసేందుకు బ్యాంకులు చర్యలు చేపట్టేలా ఎస్ఓపీని ఆర్బీఐ రూపొందించిందని తెలిపింది. సైబర్ అరెస్ట్ కేసులను గుర్తించాలని సీబీఐని ఆదేశించింది. గుర్తించిన డిజిటల్ అరెస్టు కేసుల్లో దర్యాప్తును కొనసాగించడానికి సీబీఐకి అనుమతినివ్వాలని గుజరాత్, ఢిల్లీ ప్రభుత్వాలను కోరింది. డిజిటల్ అరెస్ట్ కేసుల్లో పరిహారం అందించడానికి ఒక ప్రణాళికను (ఫ్రేమ్ వర్క్‌ను) రూపొందించడానికి ఆర్బీఐ, డీఓటీ ఇతరులు సంయుక్తంగా సమావేశాన్ని నిర్వహించాలని ఆదేశించింది. బాధితులకు పరిహారం మంజూరు చేయడంలో ఆచరణాత్మక, ఉదారవాద విధానం అవసరమని తెలిపింది.

# అన్నమయ్య జిల్లాలో బర్డ్ ఫ్లూ కలకలం...

అన్నమయ్య:ఏపీలోని అన్నమయ్య జిల్లాలో బర్డ్ ఫ్లూ వైరస్ మరోసారి తీవ్ర కలకలం సృష్టిస్తోంది. సదుం మండలంలోని మూడు గ్రామాల్లో వేలాది కోళ్లు అంతుచిక్కని రీతిలో మరణించడం స్థానికంగా ఆందోళనకు దారితీసింది. అధికారిక లెక్కల ప్రకారమే దాదాపు 24 వేలకు పైగా కోళ్లు మృత్యువాత పడ్డాయి. ఈ పరిణామంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమై నివారణ చర్యలు చేపట్టింది. వివరాల్లోకి వెళితే.. సదుం మండలంలోని పుట్టవాండ్లపల్లె, కంభంవారిపల్లె, అమ్మగారిపల్లె గ్రామాల్లోని కోళ్ల ఫారాల్లో గత కొన్ని రోజులుగా కోళ్లు భారీ సంఖ్యలో చనిపోతున్నాయి. దీంతో అనుమానం వచ్చిన పశుసంవర్ధక శాఖ అధికారులు రంగంలోకి దిగారు. మరణించిన కోళ్ల నుంచి నమూనాలను సేకరించి మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఉన్న హై సెక్యూరిటీ యానిమల్ డిసీజ్ డయాగ్నోస్టిక్ ల్యాబ్‌కు పరీక్షల నిమిత్తం పంపించారు. ఈ పరీక్షల్లో బర్డ్ ఫ్లూ వైరస్ ఉన్నట్లు నిర్ధారణ అయింది. అమ్మగారిపల్లె, పుట్టవారిపల్లె గ్రామాల్లో కోళ్ల మృతికి బర్డ్ ఫ్లూనే కారణమని స్పష్టమైందని, కంభంవారిపల్లె నివేదిక రావాల్సి ఉందని జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ గుణశేఖర్ పిళ్లై వెల్లడించారు. ఈ పరిణామాలపై జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు తక్షణమే కఠిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, పోలీస్, వైద్య ఆరోగ్య, పంచాయతీరాజ్ శాఖల సమన్వయంతో గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బర్డ్ ఫ్లూ కారణంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తరఫున నష్టపరిహారం అందిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు జిల్లా కేంద్రంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. తమ ప్రాంతంలో కోళ్లు గానీ, ఇతర పక్షులు గానీ అసాధారణ రీతిలో మరణిస్తే వెంటనే 70139 14401 లేదా 93982 62752 నంబర్లకు సమాచారం అందించాలని అధికారులు ప్రజలను కోరారు.

*** కోడి మాంసం తినొచ్చా?.. వైద్యులు ఏం చెబుతున్నారంటే!**

మరోవైపు బర్డ్ ఫ్లూ విషయంలో ప్రజలు అనవసరంగా ఆందోళన చెందవద్దని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఈ వైరస్ కోళ్ల నుంచి మనుషులకు సోకే అవకాశాలు చాలా అరుదని స్పష్టం చేశారు. అయితే, మాంసాన్ని 100 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువ ఉష్ణోగ్రత వద్ద బాగా ఉడికించి తినడం సురక్షితమని తెలిపారు. ముందుజాగ్రత్త చర్యగా, వైరస్ ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలు కనీసం 10 రోజుల పాటు కోడిమాంసం, గుడ్లకు దూరంగా ఉండటం మంచిదని సలహా ఇస్తున్నారు.

### తెలంగాణలో ముగిసిన ఎన్నికల ప్రచారం..
# ఎల్లుండి పోలింగ్

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా 7 కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు ఎల్లుండి పోలింగ్ జరగనుంది. ఈరోజుతో ప్రచారం ముగియడంతో రాష్ట్రంలో మైకులు మూగబోయాయి. ఈ నెల 11న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది. అనివార్యమైతే ఈ నెల 12న రీపోలింగ్ నిర్వహిస్తారు. ఫిబ్రవరి 13 ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తారు. గెలిచిన వారు మరుసటి రోజు వార్డు సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేస్తారు. ఫిబ్రవరి 16న మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్, కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక జరగనుంది.

# పీఎఫ్ డబ్బులు ఇక యూపీఐతోనే.. ఏప్రిల్ నుంచి కొత్త సేవలు!

ఢిల్లీ:ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) తన సేవలను మరింత వేగవంతం, సులభతరం చేసే దిశగా ఒక విప్లవాత్మక అడుగు వేస్తోంది. దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 8 కోట్ల మంది పీఎఫ్ ఖాతాదారులకు ప్రయోజనం చేకూర్చేలా సరికొత్త మొబైల్ అప్లికేషన్‌ను తీసుకురానుంది. ఈ ఏడాది ఏప్రిల్ నాటికి అందుబాటులోకి రానున్న ఈ యాప్ ద్వారా, సభ్యులు తమ పీఎఫ్ ఖాతాలోని అర్హతగల మొత్తాన్ని యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా తక్షణమే విత్‌డ్రా చేసుకునే సౌకర్యం కలగనుంది. "ఈపీఎఫ్ఓ 3.0" అప్‌గ్రేడ్‌లో భాగంగా ఈ కొత్త డిజిటల్ వ్యవస్థను ప్రవేశపెడుతున్నారు. ప్రస్తుతం పీఎఫ్ డబ్బుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే, ప్రక్రియ పూర్తి కావడానికి కొన్ని రోజులు పడుతోంది. కాగా, కొత్త ఆటోసెటిల్‌మెంట్ విధానంలో ఎలాంటి మానవ ప్రమేయం లేకుండా మూడు రోజుల్లోనే క్లెయిమ్‌లు పరిష్కారమై, డబ్బు నేరుగా బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది. ఇప్పటికే ఈపీఎఫ్ఓ ఆటోసెటిల్‌మెంట్ పరిమితిని రూ.1 లక్ష నుంచి రూ.5 లక్షలకు పెంచింది. ఏటా 5 కోట్లకు పైగా క్లెయిమ్‌లను పరిష్కరించే ఈపీఎఫ్ఓపై భారాన్ని తగ్గించి, బ్యాంకుల తరహాలో వేగవంతమైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి.

# ఆ నిధులపై లోక్‌సభలో ప్రశ్నలకు నో

ఢిల్లీ : న్యూఢిల్లీ : ప్రధాన మంత్రి సహాయ నిధి (పీఎంకేర్స్), ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి (పీఎంఎన్ ఆర్ఎఫ్), జాతీయ రక్షణ నిధి (ఎన్‌డీఎఫ్)లకు సంబంధించి లోక్‌సభలో ప్రశ్నలు అడగడం అనుమతించదగినది కాదని ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ) స్పష్టం చేసింది. ఈ విషయాన్ని లోక్‌సభ సెక్రెటేరియట్‌కు తెలిపింది. ఈ మేరకు కొన్ని నిబంధనలను పేర్కొంది. పీఎంఓ నిర్ణయంపై సర్వత్రా చర్చకు దారితీస్తున్నది. ఇది అందరిలోనూ పలు అనుమానాలు కలిగిస్తున్నది. లోక్‌సభ విధి విధానాలు, నిర్వహణ నియమావళిలోని నిబంధనల ప్రకారం ఈ మూడు నిధులకు సంబంధించిన ప్రశ్నలు ఆమోదయోగ్యం కావని వివరించింది. గతనెల 30న లోక్‌సభ సెక్రెటేరియట్‌కు పీఎంఓ దీనిని తెలియజేసినట్టు ఓ ఆంగ్ల వార్తకథనం పేర్కొన్నది. కేంద్రం పేర్కొన్న నిబంధనల ప్రకారం... భారత ప్రభుత్వ ప్రధాన బాధ్యతకు సంబంధించినవి కాని విషయాలపై ప్రశ్నలు అడగరాదు. అలాగే ప్రభుత్వం ప్రధానంగా బాధ్యత వహించని సంస్థలు లేదా వ్యక్తుల నియంత్రణలో ఉన్న అంశాలపై ప్రశ్నలు అనుమతించ రాదు. ఈ నిబంధనల ఆధారంగా పీఎంకేర్స్, పీఎంఎన్ఆర్ఎఫ్, ఎన్‌డీఎఫ్ నిధులు ప్రభుత్వం నేరుగా నిర్వహించే నిధులు కావనీ, అందువల్ల వీటిపై పార్లమెంటు ప్రశ్నలు అనుమతించలేమని పీఎంఓ వాదించింది. ఈ మూడు నిధుల మూలధనం (కార్పస్) పూర్తిగా ప్రజల స్వచ్ఛంద విరాళాలతోనే ఏర్పడిందనీ, కేంద్ర సమీకృత నిధి నుంచి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని పీఎంఓ.. లోక్‌సభ సెక్రెటేరియట్‌కు వివరించింది. భవిష్యత్తులో ఈ నిధులకు సంబంధించి ప్రశ్నలు, జీరో అవర్ నోటీసులు, ప్రత్యేక ప్రస్తావనలు వచ్చినట్టయితే... ఈ నిబంధనలను అనుసరించి వాటి అనుమతిపై నిర్ణయం తీసుకోవచ్చని కూడా పీఎంఓ సూచించింది. కాగా ఈ అంశంపై సదరు ఆంగ్ల వార్తసంస్థ పీఎంఓకు ఈమెయిల్ పంపింది. దీనిపై ప్రధాన మంత్రి కార్యాలయం స్పందించలేదు. అలాగే లోక్‌సభ సెక్రెటేరియట్‌లోని మీడియా అండ్ పబ్లిక్ రిలేషన్ శాఖ జాయింట్ సెక్రెటరీ ముకేశ్ కుమార్ శర్మ కూడా దీనిపై స్పందించలేదు.

# పంపకాలే పంపకాలు

ఖమ్మం : రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలోని 2,996 వార్డులకు ఫిబ్రవరి 11న పోలింగ్ జరగనుంది. ఎన్నికలకు సంబంధించి 48 గంటల ముందు సోమవారం సాయంత్రం ఐదు గంటలకు బహిరంగ ప్రచారానికి తెరపడింది. చివరి రోజు ప్రచారం హోరాహోరీగా సాగింది. అధికార, ప్రతిపక్షాలు హాట్ హాట్ కామెంట్లు చేసుకున్నాయి. రోడ్ షోలు, ర్యాలీలతో పార్టీలు హోరెత్తించాయి. ఇప్పటికే ప్రచార పర్వం మొదలైంది. విపక్షాలు ముందస్తు ఎత్తుగడతో మూడు రోజులు ముందు నుంచే పంపకాలు మొదలుపెట్టాయి. అధికారపక్షం నుంచి ఒత్తిళ్లు ఉంటాయని కారణంతో మూడు రోజుల ముందుగానే పంపిణీలు షురూ చేశారు. కొన్నిచోట్ల అధికార పక్షం సైతం ముందస్తు పంపకాలు మొదలుపెట్టింది. ఓటుకు రూ.1500 మొదలు... ప్రతిష్టాత్మకమైన చోట రూ. 5,000 వరకు పంచుతున్నారు. అధికార, విపక్ష ముఖ్య నేతలు ఇప్పటికే అండర్ కోర్ ఆపరేషన్లు మొదలుపెట్టారు. తద్వారా ఆయా వార్డులు, డివిజన్‌లలో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. నిన్నటి వరకు గెలుస్తాడు అనుకున్న అభ్యర్థి... పంపకాలపర్వం, ఆ వార్డులో ముఖ్యులతో ప్రధాన నేతలు చర్చిస్తుండటం మూలంగా రాజకీయ పరిస్థితుల్లో మార్పులు వస్తున్నాయి.

**అంత రహస్యమే..**

ఎన్నికల బహిరంగ ప్రచారం ముగియడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు రహస్య ప్రచారానికి తెరలేపారు. పోలింగ్ సమయం దగ్గర పడడంతో ఓటర్ టు ఓటర్‌ను కలుసుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారు. దూర ప్రాంతంలో ఉన్న ఓటర్లు తీసుకురావాడానికి ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. ఇక ఇన్నీ రోజులు చేసిన ప్రచారం ఒక తంతు అయితే.. ఇప్పుడు నిర్వహించే తతంగం ఒకఎత్తు. నేరుగా ఓటర్ ఇంటికే వచ్చి.. ఆ ఇంట్లో ఎంత మంది ఓటర్లు ఉన్నారు. ఓటుకు ఎంత అనే బేరసారాలు చేస్తున్నారు. అలాగే కుల సంఘాల వారీగా పెద్దలతో మంతనాలు జరుగుతూ వారి ఓట్లు గంపగుత్తగా కొనుగోలు చేస్తున్నారు. ఇంటింటికీ మద్యం, మటన్, చికెన్ పంపిణీ చేస్తున్నారు. ఓటర్లను మచ్చిక చేసుకోవడానికి అన్నీ ప్రయత్నాలు చేస్తున్నారు.

**గ్రేటెడ్ కమ్యూనిటీ ఓటర్లు టార్గెట్..**

గ్రేటెడ్ కమ్యూనిటీ ఓటర్లను టార్గెట్‌గా తీసుకుని.. ఆ కమ్యూనిటీ పెద్దలతో అభ్యర్థులు, పార్టీల నాయకులు మంతనాలు జరుపు తున్నారు. గ్రేటెడ్ కమ్యూనిటీలో ఉండే ఓటర్లు కొంత చైతన్యవంతులుగా ఉంటారని.. వారు ఎవరికి హామీ ఇస్తే.. వారికి పక్కాగా ఓట్లు వేస్తారన్న నమ్మకంతో వారి ఓట్లే టార్గెట్‌గా అభ్యర్థులు పోటాపోటీ ప్రయత్నాలు చేస్తున్నారు. అలాగే ప్రతీ ఓటు కీలకం కావడం తో ఓటర్ లిస్టును సైతం జల్లెడ పడుతున్నారు.

**చివరిలో పొత్తుల విచ్ఛిన్నం..**

నిన్నటి వరకు కలిసి ఉన్న పార్టీల మధ్య సైతం పొత్తులు విచ్ఛిన్నమవుతున్నాయి. కొన్నిచోట్ల బీజేపీ, జనసేన మధ్య వివాదాలు తలెత్తుతున్నాయి. మహబూబాబాద్‌లో కాంగ్రెస్ - సీపీఐ పొత్తు చెడడంతో సీపీఐ, బీఆర్ఎస్ తో జతకట్టింది. టికెట్ల పంపిణీ విషయంలో జగిత్యాల, హుజూరాబాద్ వంటి చోట్ల కాంగ్రెస్ పార్టీలో అసమ్మతి జ్వాలలు చెలరేగాయి. రాష్ట్రవ్యాప్తంగా 14 వార్డుల్లో అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇందులో మెజారిటీ స్థానాలు కాంగ్రెస్ గెలుచుకుంది.

**మూడు రోజుల ముందే పంపకాలు**

వైరాలో ఓటర్లకు మూడ్రోజుల ముందు నుంచే రూ.500 అడ్వాన్స్, స్వీట్లు, చికెన్, చీరల పంపకాలు మొదలయ్యాయి. మిగిలిన అన్ని మున్సిపాలిటీలకూ పంపిణీ వ్యవహారం వ్యాపించింది. కొన్ని వార్డుల్లో ఓటుకు రూ.500 చొప్పున పంపిణీ చేస్తుండగా, ఆయా స్థానిక పరిస్థితులను బట్టి రూ.వెయ్యి నుంచి వైరాలో రూ.5 వేల వరకు పంపిణీ మొదలు పెట్టినట్టుగా సమాచారం.

# క్షేత్రస్థాయిలో పర్యటించండి... విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు

అమరావతి: వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే పటిష్టమైన చర్యలు చేపట్టాలని, హాస్టళ్లలో విద్యార్థులు అనారోగ్యం పాలైతే సంబంధిత జిల్లా కలెక్టర్లు, మంత్రులనే బాధ్యుల్ని చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గట్టిగా హెచ్చరించారు. ప్రభుత్వ పాలసీలు క్షేత్రస్థాయిలో ఎలా అమలవుతున్నాయో తెలుసుకునేందుకు మంత్రులు, కార్యదర్శులు తప్పనిసరిగా క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పాలసీలు సమర్థవంతంగా అమలైతేనే ఆశించిన ఫలితాలు వస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. సోమవారం అమరావతి సచివాలయంలో మంత్రులు, కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. గత ప్రభుత్వ తప్పిదాల వల్ల రాష్ట్రం 14 శాతం అధిక వడ్డీతో అప్పులు చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక క్రమశిక్షణను గాడిలో పెట్టి, రాష్ట్ర క్రెడిట్ రేటింగ్ పెంచడం ద్వారా వడ్డీ భారాన్ని తగ్గించుకునేందుకు రుణాలను రీషెడ్యూల్ చేస్తున్నామని వివరించారు. ప్రతి ఐదేళ్లకు జీఎస్‌డీపీ, తలసరి ఆదాయం రెట్టింపు కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

**ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక దృష్టి**

ఆరోగ్య రంగంపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం సూచించారు. జూలై నాటికి 66 లక్షల హైరిస్క్ కేసులకు హెల్త్ స్క్రీనింగ్ పూర్తి చేయాలని, 5 లక్షల మంది హాస్టల్ విద్యార్థుల ఆరోగ్య పరీక్షలు చేపట్టాలని లక్ష్యంగా నిర్దేశించారు. గర్భిణుల్లో సిజేరియన్లు తగ్గించి, సాధారణ ప్రసవాలు పెరిగేలా అవగాహన కల్పించాలన్నారు. మాతాశిశు సంరక్షణ కోసం 'కేర్ అండ్ గ్రో' కార్యక్రమాన్ని, అంగన్‌వాడీలు, మధ్యాహ్న భోజనంలో పౌష్టికాహారం అందించాలని చెప్పారు. రాష్ట్ర జనాభా నిర్వహణ కోసం మార్చి నాటికి 'పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ' తీసుకురానున్నట్లు సీఎం వెల్లడించారు. విద్యారంగంలో ఒత్తిడి లేని విద్యావిధానం అమలు చేయాలని, పదో తరగతి ఫలితాల్లో మెరుగుదలకు 100 రోజుల ప్రణాళికను పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. విద్యార్థుల ఆత్మహత్యలు జరగకూడదని, నూతన ఆవిష్కరణలకు స్వేచ్ఛాయుత వాతావరణం ఉండాలని అభిప్రాయపడ్డారు.

*** నీటి సంరక్షణ, అభివృద్ధిపై కీలక సూచనలు**

రాష్ట్రంలోని 38 వేలకు పైగా ఉన్న చిన్న నీటిపారుదల చెరువులను పరిరక్షించాలని, భూగర్భ జలాలను 'నీటి బ్యాంకు' తరహాలో వాడాలని సూచించారు. పారిశ్రామిక కాలుష్యంతో జలాలు కలుషితం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అల్లూరి జిల్లా లంబసింగిలో కుంకుమ పువ్వు సాగు, ఏలూరు సమీపంలో కోకో సిటీ ఏర్పాటు వంటి వినూత్న ప్రాజెక్టులకు అవకాశాలున్నాయని, వీటిని ప్రోత్సహించాలని సీఎం సూచించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఇతర మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


# ప్రజలు కోల్పోయిన ఆస్తిని తిరిగి అందించడమే పోలీస్ శాఖ ముఖ్య బాధ్యత

*** కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి**




కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : ప్రజలు కోల్పోయిన ఆస్తిని తిరిగి అందించడమే పోలీస్ శాఖ ముఖ్య బాధ్యత అని కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి అన్నారు. కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో కోల్పోయిన విలువైన బంగారు బ్రేస్‌లెట్‌ను సోమవారం పోలీసులు తక్షణమే గుర్తించి ఫిర్యాదురాలికి భద్రంగా అప్పగించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఫిర్యాదు అందిన వెంటనే సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టి బంగారు బ్రేస్‌లెట్‌ను గుర్తించామని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే మా లక్ష్యం" అని స్పష్టం చేశారు. చిన్నదైనా, పెద్దదైనా ప్రతి ఫిర్యాదును బాధ్యతగా తీసుకుని దర్యాప్తు చేయడమే తమ విధి అని కేపీహెచ్‌బీ పోలీసులు మరోసారి నిరూపించారు. కెపిహెచ్బీ ప్రాంతానికి చెందిన ఓ మహిళ ఈ నెల 5వ తేదీ మధ్యాహ్నం రోడ్ నెం.1లో రూబీ స్టోన్ డిజైన్ కలిగిన సుమారు 1.5 తులాల బంగారు బ్రేస్‌లెట్‌ను కోల్పోయారు. వెంటనే పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించగా, క్రైమ్ టీమ్ అప్రమత్తంగా స్పందించి స్వల్ప సమయంలోనే కేసును ఛేదించిందన్నారు. పోయిందనుకున్న బంగారు బ్రేస్‌లెట్ తిరిగి లభించడంతో బాధితురాలు ఆనందం వ్యక్తం చేస్తూ, వృత్తి నిబద్ధతతో పనిచేసిన కేపీహెచ్‌బీ పోలీసులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# గెలుపే లక్ష్యంగా సీపీఐ అభ్యర్థి కనుకుంట్ల సాహితి ప్రచారం




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల ప్రచారం తుది దశకు చేరుకోవడంతో రాజకీయ పార్టీల అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా ప్రచారాన్ని ఉధృతం చేశారు. ఈ నేపథ్యంలో సీపీఐ పార్టీ తరపున పోటీ చేస్తున్న కనుకుంట్ల సాహితి ప్రచారంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చివరి రోజు కావడంతో ఆమె తన అనుచరులు, పార్టీ కార్యకర్తలతో కలిసి డోర్ టు డోర్ ప్రచారం నిర్వహిస్తూ ఓటర్లను కలుసుకున్నారు.ప్రచారం సందర్భంగా ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ప్రజల సమస్యలను ఆరా తీస్తూ, తనకు అవకాశం ఇస్తే ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యంగా మహిళలు, యువత, వృద్ధులతో మాట్లాడుతూ వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రాంత అభివృద్ధి, మౌలిక సదుపాయాల మెరుగుదల, శుద్ధమైన తాగునీరు, పారిశుధ్యం, కాలువల నిర్మాణం వంటి అంశాలను తన ప్రాధాన్యాలుగా పేర్కొన్నారు.ఈ సందర్భంగా సాహితి మాట్లాడుతూ తాను విద్యావంతురాలిగా ప్రజల సమస్యలను అర్థం చేసుకొని పరిష్కరించే సామర్థ్యం కలిగి ఉన్నానని తెలిపారు. ప్రజల ఆశయాలను నెరవేర్చే నాయకత్వం అవసరమని, తమకు అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. ప్రచారంలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని పార్టీ జెండాలు, నినాదాలతో ప్రాంతంలో ఉత్సాహభరిత వాతావరణాన్ని సృష్టించారు. ఎన్నికల ప్రచారం ముగిసే సమయానికి సాహితి తన ప్రచారాన్ని మరింత వేగవంతం చేసి ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేశారు.కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థి కనుకుంట్ల సాహితి ప్రచారం ఆసక్తికరంగా మారి రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా నిలుస్తోంది.

# ఎంఐఎం మద్దతు లేకుండా కాంగ్రెస్ గెలిచిందా? : ఒవైసీ



హైదరాబాద్ : రెడ్లు అయినా, రావులు అయినా తమ దగ్గరకు రావాల్సిందేనని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రుల దగ్గరకు తాము వెళ్లమని, వాళ్లే తమ దగ్గరకు రావాలని అన్నారు. ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఎంఐఎం మద్దతు లేకుండానే కాంగ్రెస్ గెలిచిందా? అని ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్నికల్లో ఎంఐఎం సత్తా ఏమిటో చూపుతామని అన్నారు. మరోవైపు అసోం సీఎం హిమంత బిశ్వపై హైదరాబాద్ పోలీసులకు ఒవైసీ ఫిర్యాదు చేశారు. ముస్లింలను కాల్చుతున్నట్టుగా ఉన్న వీడియోను పోస్టు చేసినందుకు ఆయనపై చర్యలు తీసుకోవాలని ఒవైసీ అన్నారు. ముస్లింలను రెచ్చగొట్టేందుకు దురుద్దేశపూర్వకంగా ఈ వీడియోను హిమంత పోస్టు చేశారని మండిపడ్డారు. జాతీయ సమైక్యతకు విఘాతం కలిగించేలా ఆయన తీరు ఉందని విమర్శించారు.

# ఈ నెల 24న నిర్వహించే ఛలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



మల్కాజిగిరి, ప్రజాస్ఫూర్తి : ఈ నెల 24న నిర్వహించే ఛలో సెక్రటేరియట్'' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జెఎసి ఛైర్మన్ ఈదురు వెంకన్న అన్నారు. సోమవారం ఎంప్లాయీస్ యూనియన్ కేంద్ర కార్యాలయంలో జెఎసి అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జెఎసి ఛైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ ఛైర్మన్ ఎం.థామస్ రెడ్డి, కన్వీనర్ ఎండి.మౌలానా, కోకన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, బి.యాదగిరి హాజరై ప్రసంగిస్తూ ఆర్టీసి కార్మికులకు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని సుమారు రెండున్నర సంవత్సరాల నుండి జెఎసి ఆధ్వర్యంలో పలు ఉద్యమాల ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి , మంత్రుల దృష్టికి, యాజమాన్యం దృష్టికి తీసుకు వెళ్ళినప్పటికీ హామీల అమలుకు నోచుకోలేదని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలలో ప్రధానంగా ఆర్టీసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తామని, యూనియన్లపై ఆంక్షలను ఎత్తివేస్తామని, 2021 వేతన సవరణ అమలు చేస్తామని, ఆర్టీసిని విస్తరిస్తామని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని చెప్పి ఏ ఒక్కటీ అమలు చేయకుండా వాటిని ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. ఆర్టీసి కార్మికులపై ఈ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం పెట్టి విపరీతమైన పనిభారాలు మోపిందని, రోజుకు 16 గంటలు బలవంతంగా డ్యూటీలు చేయిస్తూ కార్మికుల నడ్డి విరుస్తున్నారని, ఇంకా ఎంతకాలం ఈ బాధలు, కష్టాలు కార్మికులుఅనుభవించాలని ప్రభుత్వాన్ని వారు ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై కార్మికులలో రోజు రోజుకూ అసంతృప్తి, వ్యతిరేకత తీవ్రరూపం దాలుస్తున్నాయని, అందులో భాగంగా ఈరోజు జెఎసి నాయకత్వం ఫిబ్రవరి 24న "ఛలో సెక్రటేరియట్'' కార్యక్రమానికి పిలుపునిస్తున్నామని తెలిపారు.కార్మికవర్గం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపోల నుండి పెద్దయెత్తున తరలివచ్చి "ఛలో సెక్రటేరియట్'' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సి.ఎన్.కృష్ణఎన్.ఎం.యు, జె.రాఘవులుఈయు, ఎన్.బాల్ రెడ్డిఈయు, ఎన్.బుద్ధ విశాల్‌బికెయు,ఎం.ఎ.మజీద్-ఈయు, డి.రాంచందర్ బిడబ్ల్యుయు, పాపయ్యగౌడ్, ముత్యాలు, రమేష్‌శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు




# పేద విద్యార్థికి లయన్స్ క్లబ్ చేయూత

*** రూ. 1.30 లక్షల ఆర్థిక సహాయం**
*** చెక్కును అందజేసిన టి ఆర్ ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే వివేకానంద్**

(ప్రజాస్ఫూర్తి, కుత్బుల్లాపూర్) : పేద విద్యార్థికి ఆర్థిక చేయూతనందించేందుకు లయన్స్ క్లబ్ సభ్యులు ముందుకు రావడం అభినందనీయమని టి ఆర్ ఎస్ ఎల్ పి విప్, కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కెపి వివేకానంద అన్నారు. సూరారం కాలనీ 60 గజాలకి చెందిన శ్రీపతి ఉదయ్ కుమార్ ఆస్ట్రేలియాలో మైక్రో బయాలజీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ అవకాశం వచ్చింది. సదురు విద్యార్థి ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే ఉండడంతో సహాయం కోరుతూ స్థానిక శాసనసభ్యుల్ని ఆశ్రయించారు. ఇందుకు స్పందించిన ఆయన లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్ సభ్యులకు సమాచారం అందించారు. ఈ మేరకు లయన్స్ క్లబ్ సభ్యులు రూ. 1.30 లక్షలను జమ చేసి సోమవారం ఉదయం ఎమ్మెల్యే చేతుల మీదుగా సదరు విద్యార్థికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేకానంద మాట్లాడుతూ తాను కోరిన కేవలం రెండు రోజుల్లోనే విద్యార్థికి అండగా నిలిచేందుకు ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. పేద విద్యార్థులకు, సామాన్యులకు ఎప్పుడు అండగా ఉండాలని కోరారు. నియోజకవర్గంలో అందరూ పేద విద్యార్థులకు వైద్య విద్య, ఇంజనీరింగ్ విద్య పూర్తి చేసేందుకు ఆర్థికపరంగా ఆదుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్ అధ్యక్షులు బిర్రు ఆంజనేయులు, డిస్టిక్ మాజీ గవర్నర్ విజయ్ కుమార్ శెట్టి, లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు చల్లా శ్రీనివాస్ రెడ్డి, రామేశ్వర్ రెడ్డి, కోలా వెంకటేష్ ముదిరాజ్, శ్రీనివాస్ రెడ్డి, నరసింహులు గౌడ్, బాలరాజు, ప్రవీణ్, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## కొత్తగూడెం నా సొంత గడ్డ

# అభివృద్ధి మా ప్రభుత్వంతోనే సాధ్యం

*** మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సందర్భంగా కొత్తగూడెం, రామవరం ప్రాంతాల్లో నిర్వహించిన ప్రచార కార్నర్ మీటింగ్‌లో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయాన్ని కోరుతూ నిర్వహించిన ఈ సమావేశంలో ఆయన ప్రసంగం ఆకట్టుకుంది.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కొత్తగూడెం తన సొంత గడ్డ అని పేర్కొన్నారు. ప్రాంత అభివృద్ధి చేయాలంటే కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని స్పష్టం చేశారు. అభివృద్ధి చేస్తానని చెబుతాడు... నానా వేషాలతో వస్తారు, వారిని నమ్మకండి" అంటూ విమర్శలు గుప్పించారు.ప్రతి పేద కుటుంబానికి ఇల్లు అందించే లక్ష్యంతో ప్రభుత్వం నాలుగు విడతల్లో "ఇందిరమ్మ ఇళ్లు" నిర్మాణానికి చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు. తాను రెవెన్యూ శాఖ మంత్రిగా చిట్టి రామవరం ప్రాంతంలో ఉన్న పోడు భూములను గుర్తించి అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు అందజేస్తామని హామీ ఇచ్చారు.దశాబ్ద కాలంగా రేషన్ కార్డులు పొందని పేద కుటుంబాలకు తమ ప్రభుత్వం రేషన్ కార్డులు అందించిందని చెప్పారు.పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంలో తానే ముందుంటానని మంత్రి స్పష్టం చేశారు. రంగురంగుల జెండాలు పట్టుకుని వచ్చే నాయకుల మాటలు నమ్మవద్దని ప్రజలను కోరారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేస్తూ, అభివృద్ధి చేసే బాధ్యతను కుటుంబ సభ్యుడిగా తాను తీసుకుంటానని తెలిపారు.ఈ రోడ్ షోలో 14వ డివిజన్ అభ్యర్థి శ్రీరాముల విశ్వనాథం, 15వ డివిజన్ అభ్యర్థి ఆకునూరు సుప్రియ, 16వ డివిజన్ అభ్యర్థి శాంతాదేవి, 17వ డివిజన్ అభ్యర్థి దాట్ల సందీప్, 18వ డివిజన్ అభ్యర్థి మాతంగి దివ్య, 19వ డివిజన్ అభ్యర్థి కేతావత్ స్వప్న శంకర్ నాయక్ పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ నాయకులు, ఆశావాహులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# విద్యార్థులకు షూస్, శానిటరీ నాప్కిన్స్ పంపిణీ

*** సహాయం చేయడం ఓ పాషన్ కావాలి: ఎంఈఓ బాలాజీ**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: యంగ్ ఇండియన్ బ్లడ్ డోనార్స్ క్లబ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, హైదరాబాద్‌కు చెందిన స్వప్నిక రేహ ఫౌండేషన్ సహకారంతో రామాపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు షూస్, గౌతంపూర్ మరియు రుద్రంపూర్ హై స్కూల్ విద్యార్థినులకు శానిటరీ నాప్కిన్స్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా స్వప్నిక రేహ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు మహాలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సహాయం చేయడం ఆనందాన్ని ఇస్తుందని తెలిపారు. భవిష్యత్తులో విద్యార్థులకు అవసరమైన మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని కల్పించిన యంగ్ ఇండియన్ ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాశాఖ అధికారి బాలాజీ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఇతరులకు సహాయం చేయడాన్ని ఓ పాషన్‌గా, బాధ్యతగా భావించాలన్నారు.ఈ కార్యక్రమంలో యంగ్ ఇండియన్ ఫౌండేషన్ అధ్యక్షుడు జేబీ బాలు, గౌతంపూర్ కాంప్లెక్స్ హెచ్‌ఎం రాములు, ఉపాధ్యాయులు అరుణ, చంద్రశేఖర్, కరీముల్లా, శాంతిశ్రీ, వాలంటీర్ మణికంఠ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

**: కలెక్టర్ జితేష్ వి. పాటిల్**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు.రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ జితేష్ వి. పాటిల్, అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, అదనపు కలెక్టర్ విద్యాచందన, పరిశీలకులు అమోయ్ కుమార్, జడ్పీ సీఈవో నాగలక్ష్మి పాల్గొన్నారు.కొత్తగూడెం కార్పొరేషన్, ఇల్లందు, అశ్వరావుపేట మున్సిపాలిటీలలో పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. పోలింగ్, కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ ఇచ్చి, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు సిద్ధం చేసినట్లు చెప్పారు.అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేసి, పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ పూర్తి చేసినట్లు తెలిపారు. సమస్యాత్మక కేంద్రాల వద్ద అదనపు భద్రత ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.సమావేశంలో త్రినాథ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో హత్యలు, అత్యాచారాలు పెరిగిపోయాయి: డీకే అరుణ



హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీజేపీ ఎంపీ డీకే అరుణ విమర్శలు గుప్పించారు. తెలంగాణలో మహిళలపై అత్యాచారాలు, హత్యలు పెరిగిపోయాయని ఆమె మండిపడ్డారు. మున్సిపల్ ఎన్నికల తర్వాత పన్నులు పెంచేందుకు రేవంత్ సర్కార్ సిద్ధమవుతోందని ఆరోపించారు. ఖజానాలో చిల్లిగవ్వ లేదని... మరోసారి ప్రజలను మోసం చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని విమర్శించారు. అన్ని మున్సిపాలిటీల్లో గెలుపే లక్ష్యంగా తమ పార్టీ హైకమాండ్ ఆదేశాల మేరకు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించామని అరుణ తెలిపారు. మహబూబ్ నగర్ పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించానని చెప్పారు. మహబూబ్ నగర్, జడ్చర్ల, భూత్‌పూర్ మున్సిపాలిటీల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వ నిధులు అవసరమని అరుణ అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. పారదర్శక, అవినీతి రహిత పాలనే బీజేపీ లక్ష్యమని చెప్పారు. ప్రతి వార్డులో డ్రైనేజీ, విద్యుత్, తాగునీరు తదితర అంశాలపై దృష్టి సారిస్తామని... కేంద్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. పట్టణాల్లోని స్లమ్ ఏరియాలపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేస్తామని తెలిపారు.

## కీసర శ్రీ రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



మేడ్చల్ ప్రతినిధి, ప్రజాస్ఫూర్తి : కీసర శ్రీ రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 13 వ తేదీ నుంచి 18వ తేదీ వరకు జరగనున్న నేపథ్యంలో సోమవారం కీసర గుట్టకు వెళ్ళిన కలెక్టర్ మన చౌదరి, మల్కాజ్గిరి డిసిపి శ్రీధర్ , ట్రాఫిక్ డిసిపి రాహుల్ రెడ్డి ఆర్డిఓ రాజేష్, ఆలయ కమిటీ చైర్మన్ తటాకం వెంకటేశ్, ఆలయ ఈవో సుధాకర్ రెడ్డి లకు ఆలయ పండితులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు అనంతరం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ కీసర శ్రీ రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో విఐపి దర్శనాలతో సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు సౌకర్యవంతంగా ఉండేందుకు క్యూలైన్ లను పెంచాలన్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున ఆర్టీసీ బస్సులు పెంచాలన్నారు. భద్రతా లోపం తలెత్తకుండా పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు నిర్వహించాలన్నారు. భక్తులకు అత్యవసర చికిత్సకై అవసరమైన వైద్య సిబ్బంది, మందులు అందుబాటులో ఉండాలన్నారు. బ్యారీకేడ్, దర్శనం క్యూ లైన్, పార్కింగ్కు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, ప్రస్తుతం ఎండలు పెరుగుతున్నాయని అందుకు జాతరలో భక్తులకు అందుబాటులో అవసరమైన అన్ని చోట్ల త్రాగునీటిని అందుబాటులో ఉంచాలని వాటర్ వర్క్స్ వారికీ తెలిపారు. జాతరలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొంటారు ఎవరికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. దర్శనార్థం వచ్చే వృద్ధులు దివ్యాంగులకు ప్రత్యేక వాహన సదుపాయం కల్పించాలని ట్రాఫిక్ పోలీస్ అధికారులకు సూచించారు. జాతరలో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చూడాలని అందుకు సంబంధించి ఎప్పటికప్పుడు శానిటేషన్ చేయాలని ఈ విషయంలో అవసరమైన ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సిందిగా కలెక్టర్ తెలిపారు. కీసర గుట్ట బ్రహ్మోత్సవాల జాతరలో పూజ సామాగ్రి , ఆహార పదార్థాల నుంచి మొదలుకొని అన్ని రకాల వస్తువుల విక్రయానికి సంబంధించి ధరలు భక్తులకు అందుబాటులో ఉండేలా చూడాలని, ఎక్కువ ధరలకు విక్రయించకుండా అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత శాఖ అధికారులు వ్యాపారులకు తెలపాలన్నారు. జాతర రోజుల్లో ఆలయ పరిసరాల్లో అగ్నిమాపక సిబ్బందితో పాటు ఫైరింజన్ను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కీసర ఆలయంకు సంబంధించి ఏమైనా ఇబ్బందులు, సమస్యలు ఉన్నట్లయితే తన దృష్టికి తీసుకురావాలని ఆలయ ఈవో, ఛైర్మన్ కు తెలిపారు. మహాశివరాత్రికి కీసరగుట్టలో రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి విజయవంతం చేయాలని కలెక్టర్ సమావేశంలో స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## భార్య ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కానిస్టేబుల్ సస్పెన్షన్



సిద్ధిపేట : ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరవుతూ, చేర్యాల మున్సిపల్ ఎన్నికల బరిలో నిలిచిన తన భార్యకు మద్దతుగా ప్రచారంలో పాల్గొన్నట్లు ఆధారాలతో రుజువు కావడంతో సిద్ధిపేట జిల్లా కొమురవెల్లి పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ కె. రమేశ్ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించడం, పోలీసు ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించడం వంటి కారణాలతో ఈ చర్య తీసుకున్నట్లు సీపీ సాధన రష్మీ పెరుమాళ్ పేర్కొన్నారు. ఈ విషయం తెలిసిన వెంటనే రమేశ్ భార్య, చేర్యాల 2వ వార్డు బీఆర్ఎస్ అభ్యర్థి కమలాపురం గీతాంజలి నిరసనకు దిగారు. స్థానిక అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించిన ఆమె అక్కడే బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గీతాంజలి మాట్లాడుతూ.. తమ ప్రత్యర్థికి ఓటమి భయం ఉండటంతో అధికార బలాన్ని ఉపయోగించి తన భర్తను సస్పెండ్ చేయించారని ఆరోపించింది. తాను నామినేషన్ దాఖలు చేసినప్పటి నుంచి ఎన్నో ప్రలోభాలు చూపించి పోటీ నుంచి తప్పించేందుకు ప్రయత్నించారని, అంగీకరించకపోవడంతో చివరకు ఇలా కక్ష సాధించారని ఆమె విమర్శించారు.

## కొత్త కమిటీకి.. చట్టబద్ధమైన అనుమతులు.. అధికారిక ఆమోదం లేదు

**: భక్తులు, ప్రజలు తప్పదోవ పట్టకూడదు**

*** చైర్మన్ అర్ధ వెంకట్ రెడ్డి**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: శ్రీ శ్రీ సరళ మైసమ్మ అమ్మవారి దేవాలయ అభివృద్ధి పేరిట ప్రకటించిన నూతన కమిటీకి.. చట్టబద్ధమైన అనుమతులు, ఎలాంటి గుర్తింపు, అధికారిక ఆమోదం లేదని శ్రీ శ్రీ సరళ మైసమ్మ అమ్మవారి దేవాలయ అభివృద్ధి చైర్మన్ అర్ధ వెంకటరెడ్డి స్పష్టం చేశారు. చౌటుప్పల్ మండలం అల్లాపురం గ్రామంలో కమిటీ కార్యవర్గ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్ధ వెంకటరెడ్డి మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థ నారాయణ పురం మండలం రాచకొండ రెవిన్యూ గ్రామం శ్రీ శ్రీ సల్ల మైసమ్మ అమ్మవారి దేవాలయానికి సంబంధించిన నూతన కమిటీ ఏర్పాటు పేరిట వచ్చిన వార్తా కథనం పూర్తిగా అవాస్తవమన్నారు. ఆ వార్త కథనంలో పేర్కొన్న నూతన కమిటీ ఏర్పాటు విషయాన్ని పూర్తిగా ఖండిస్తున్నామన్నారు. ఆ కమిటీ ఏర్పాటుకు మాకు ఎలాంటి సమ్మతి లేదు, చట్టబద్ధమైన అనుమతులు, అధికారిక ఆమోదం కూడా లేవని స్పష్టం చేశారు. ఆ కమిటీ పేరుతో చేపట్టబడే ఈ చర్యలైన అనధికారికమైనవని, చట్ట విరుద్ధమైనవని, ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా పరిగణించబడతాయన్నారు. భక్తులు ప్రజలు ఈ విషయంలో తప్పుదోవ పట్టకూడదని, సమావేశం ద్వారా విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. దేవస్థానానికి సంబంధించి పరిపాలన వ్యవహారాలు, చట్టబద్ధంగా కొనసాగుతున్న ప్రస్తుత ఏర్పాట్ల ప్రకారమే చెల్లుబాటు అవుతాయన్నారు. దేవస్థానం పవిత్రత, పరిపాలన, భక్తుల ప్రయోజనాలను కాపాడడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోబడతాయన్నారు. ఈ సమావేశంలో శ్రీశ్రీశ్రీ మైసమ్మ అభివృద్ధి కమిటీ అవును గౌరవ అధ్యక్షులు వరకాంతం మహిపాల్ రెడ్డి, కొలను శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సామ అంజిరెడ్డి, ఉపాధ్యక్షులు ముత్యాల నర్సిరెడ్డి, కొలను మాధవరెడ్డి, కోశాధికారి కొలను నరేందర్ రెడ్డి, రాసాల శ్రీకాంత్, ప్రచార కార్యదర్శి సామ సుదర్శన్ రెడ్డి, ముత్యాల సుదర్శన్ రెడ్డి, ఫకీరు శ్రీకాంత్ రెడ్డి, బొడ్డు గాలయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

*** ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**

*** మీడియా సమావేశంలో కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారం ముగియడంతో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాలతో కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ డిఎస్పీ కార్యాలయంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11వ తేదీన జరగబోయే ఎన్నికలు సజావుగా జరిగేలా పోలీస్ శాఖకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటివరకు కొత్తగూడెం పట్టణ పరిధిలోని 33 డివిజన్లలో 34,000/ల రూపాయల విలువగల 40 లీటర్ల మద్యాన్ని, 2,70,000/రూపాయల విలువ గల 5.5 కేజీల ప్రభుత్వ నిషేధిత గంజాయిని స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్టర్ను ఉల్లంఘించినందుకు గాను మూడు కేసులు నమోదు చేయడం జరిగిందని,110 కేసుల్లో 258 మంది సమస్యాత్మక వ్యక్తులను బైండోవర్ చేయడం జరిగిందని వివరించారు.33 డివిజన్లలోని 41 పోలింగ్ స్థానాలలో 110 పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ఇందులో 65 పోలింగ్ కేంద్రాలు సున్నితమైనవిగా,45 సాధారణ పోలింగ్ కేంద్రాలుగా గుర్తించడం జరిగిందన్నారు. ఓటర్లను ప్రలోభ్ పెట్టే విధంగా ఎవరైనా మద్యం నగదు ఇతరత్రా వస్తువులను సరఫరా చేస్తూ పట్టుబడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదని అన్నారు.



## కార్పొరేషన్ ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలి

*** సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివ రావు**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ఇది అహంకారానికి ఆత్మీయతకి మధ్య జరుగుతున్న పోటీ అని, ఈ కార్పొరేషన్ ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకొని ఆత్మ గౌరవాన్ని నిలుపుకుందామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివ రావు అన్నారు. కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగాసోమవారం రామవరంలోని ఆరు డివిజన్లు, బర్మా క్యాంపు, ప్యూన్స్ బస్తి ఏపవర్ హౌస్ బస్తీ, గంగా బిషన్ బస్తీలో రోడ్ షోలు, కార్నర్ మీటింగులు నిర్వహించారు. ఈసందర్భంగాకూనంనేని మాట్లాడుతూ ఎర్రజెండాది ఏముందిలే అంటూ అవాకులు చవాకులు పేలుతున్న వాళ్లు సిపిఐకి అందుతున్న ఆదరణను చూసి ఎందుకు హైరానా పడుతున్నారని అన్నారు. పాల్వంచ మొదలుకొని కొత్తగూడెం. సుజాతనగర్ వరకు ఉన్న కార్పొరేషన్ 60 డివిజన్లు ఎరుపు పసుపు రంగుల జెండాలతో రెపరెపలాడుతున్నాయని చెప్పారు. రాబోయే రోజుల్లో యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, ప్రజల ఆర్థిక స్థితిగతుల్లో మార్పులు చోటు చేసుకుంటాయని, పారిశ్రామిక, విద్య, వైద్యరంగాలు మరింత అభివృద్ధి సాధిస్తాయని చెప్పారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన నాటినుండి పెద్ద ఎత్తున నిధులను సమీకరించి నియోజకవర్గ వ్యాప్తంగా అభివృద్ధి కొనసాగిస్తున్నామని, మారుమూల ప్రాంతాల్లో సైతం మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని, ఎర్త్ యూనివర్సిటీ తీసుకొచ్చామని, ఈ యూనివర్సిటీలో చదువుకునేందుకు దేశ విదేశాల నుండి విద్యార్థులు శాస్త్రవేత్తలు తరలి రాబోతున్నారని తెలిపారు.పేదలు బడుగు బలహీన వర్గాల కోసం కార్మికులు కర్షకులు చేతివృత్తిదారుల ప్రయోజనాల కోసం పనిచేస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి స్వార్థం లేకుండా కేవలం అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. పేదలకు అండగా ఉండేది ఎర్రజెండానే అని ఈ వందేళ్ళ కాలంలో అది నిరూపితమైందని తెలిపారు. ప్రజా ఆశీర్వాదమే మనకు బలమని. కంకి కొడవలి గుర్తుకు ఓటేసి సిపిఐ అభ్యర్థులను గెలిపించుకోవడం ద్వారా సుపరిపాలనను స్వాగతించినట్లు అవుతుందని అన్నారు. కార్పొరేషన్ వ్యాప్తంగా చక్కటి ఫలితాలు రానున్నాయని, మేయర్ పీఠం మనదే అని చెప్పారు.

## కూకట్‌పల్లి ఆస్బెస్టాస్ కాలనీలో బాలుడికి కరెంట్ షాక్

**– విద్యుత్ శాఖ నిర్లక్ష్యమే కారణమా?**




కూకట్ పల్లి ప్రజాస్ఫూర్తి : కూకట్‌పల్లి డివిజన్, పాపిరెడ్డి నగర్ కాలనీ పరిధిలోని ఆస్బెస్టాస్ కాలనీలో చోటు చేసుకున్న విషాద ఘటన విద్యుత్ శాఖ నిర్లక్ష్యాన్ని మరోసారి వెలుగులోకి తెచ్చింది. పతంగితో ఆడుకుంటున్న బాలుడు, దారం తెగి సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పడడంతో, పతంగిని తీసుకురావడానికి వెళ్లి కరెంట్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు.స్థానికులు వెంటనే బాలుడిని ఆసుపత్రికి తరలించినప్పటికీ, బాలుడి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ ఘటనతో తల్లిదండ్రులు తీవ్ర మనోవేదనకు గురయ్యారు.అయితే, ఈ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గతంలోనూ ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పటికీ, విద్యుత్ శాఖ అధికారులు ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. జనావాసాల మధ్య ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఫెన్సింగ్, హెచ్చరిక బోర్డులు, భద్రతా కవరింగ్ వంటి మౌలిక ఏర్పాట్లు చేయాల్సి ఉండగా, అవి లేకపోవడమే ఈ దుర్ఘటనకు కారణమని వారు పేర్కొన్నారు.

**ఇప్పటికైనా విద్యుత్ శాఖ మేల్కొంటుందా?**

ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ట్రాన్స్‌ఫార్మర్‌ల చుట్టూ భద్రతా ఏర్పాట్లు చేయడం, పిల్లలు చేరుకోలేని విధంగా చర్యలు తీసుకోవడం అధికారుల బాధ్యత కాదా? ఒక బాలుడి ప్రాణాలే ప్రమాదంలో పడిన తరువాతైనా శాఖ స్పందిస్తుందా? అనే ప్రశ్నలు ప్రజల మనసుల్లో ఉత్పన్నమవుతున్నాయి.బాధిత బాలుడికి తక్షణ మెరుగైన చికిత్స అందించడంతో పాటు, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, అలాగే కాలనీలోని అన్ని ట్రాన్స్‌ఫార్మర్‌ల భద్రతపై సమగ్ర తనిఖీ నిర్వహించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## బండి సంజయ్, గంగుల తీరుతో కరీంనగర్ అవినీతిమయమైంది

**: పొన్నం ప్రభాకర్**



కేంద్ర మంత్రి బండి సంజయ్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పై తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. వీరి తీరుతో కరీంనగర్ అవినీతిమయమయిందని అన్నారు. కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు ఎంఐఎంతో కాంగ్రెస్ పార్టీ రూ. 100 కోట్ల డీల్ చేసుకుందంటూ బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. కరీంనగర్ కార్పొరేషన్ లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒప్పందం కుదుర్చుకున్నాయని పొన్నం మండిపడ్డారు. ఈ పార్టీల పరస్పర అవగాహనతోనే అభ్యర్థుల ఎంపిక జరిగిందని ఆరోపించారు. బండి సంజయ్, గంగుల కమలాకర్ తీరుతో జిల్లా అవినీతిమయంగా మారిందని అన్నారు. పదేళ్లలో కరీంనగర్ జిల్లా పూర్తిగా నిర్లక్ష్యానికి గురయిందని చెప్పారు. జిల్లా పరిధిలోని కొండగట్టు, వేములవాడ ఆలయాలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.

## కోదాడలో ఈడీ అధికారులు.. ఏకకాలంలో ఆరుచోట్ల సోదాలు

సూర్యాపేట: కోదాడ పట్టణంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు ఆకస్మిత దాడులు చేశారు. ఆదాయానికి మించిన ఆస్తులున్నాయనే అభియోగంతో నీలా సత్యనారాయణ అనే వ్యక్తి ఇంట్లో సోమవారం విస్తృతంగా తనిఖీలు చేశారు. ఆయన ఇంట్లో, ఆఫీసుల్లో బంధువుల ఇళ్లలో ఈడీ అధికారులు సోదాలు జరిపారు. నీలా సత్యనారాయణకు చెందిన కోదాడ పట్టణంలోని ఓ రైస్ మిల్లులో, కళాశాలలో, బంధువుల ఇళ్లతోపాటు మొత్తం ఆరు చోట్ల ఏకకాలంలో దాడులు చేపట్టారు. ఆదాయానికి మించి ఆస్తులు, సీఎంఆర్ బియ్యం ఎగవేత, నిబంధనలకు విరుద్ధంగా బ్యాంకు నుంచి రుణాలు పొందటంపై అధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. దీనిపై ఈడీ అధికారులను వివరణ కోరగా సోదాలు పూర్తయిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

## దమ్ములేదు అని చెప్పు చాలు.. మిగతాదంతా నేను చూసుకుంటా

**: సీఎం రేవంత్‌కు బండి సంజయ్ సవాల్**



కరీంనగర్ : మున్సిపల్ ఎన్నికల్లో పోలింగ్‌కు ముందే కాంగ్రెస్ ఓటమి ఖాయమైందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, మున్సిపాలిటీలకు నిధులివ్వకుండా మోసం చేస్తున్న కాంగ్రెస్‌కు బుద్ది చెప్పాలని ప్రజలంతా డిసైడ్ అయ్యారని అన్నారు. ఇంటెలిజెన్స్, సర్వేల ద్వారా సమాచారం తెప్పించుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఓటమి ఖాయమనే ఫ్రస్ట్రేషన్‌తో బీజేపీపై అడ్డగోలుగా మాట్లాడుతున్నారని చెప్పారు. బీఆర్ఎస్‌పై కోపంతో కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపిస్తే.. రెండేళ్లలో కాంగ్రెస్ బండారం బయటపడిందన్నారు. ఆ పార్టీ సంగతి అర్ధమైంది కాబట్టే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ది చెప్పాలని ప్రజలంతా డిసైడ్ అయ్యారని చెప్పారు. ఈ విషయం తెలిసే సీఎం ఫ్రస్ట్రేషన్‌కు లోనై బీజేపీపై అడ్డగోలుగా మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. ఒవైసీని తాను దేవుడిలా తలుస్తున్నట్లు సీఎం చెప్పడంపై తనదైన శైలిలో బదులిచ్చారు. 'సీఎం, ఒవైసీ మాట్లాడుతున్న స్క్రిప్ట్ ఒకటే. మొన్న ఒవైసీ కరీంనగర్ వచ్చి బండి సంజయ్‌కు తన భార్య కంటే నన్నే ఎక్కువ ఇష్టపడతారని చెప్పారు. ఇవాళ సీఎం కూడా బండి సంజయ్ ఒవైసీని దేవుడిలా చూస్తారని చెప్పారు. బహుశా ఇద్దరి స్క్రిప్ట్ దారుస్సలాంలోనో లేక గాంధీభవన్‌లో ప్రిపేర్ అవుతున్నట్లుంది. అందుకే ఇద్దరూ ఒక్కటే మాట్లాడుతున్నారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో సీఎం తన చేతగానితనాన్ని ఇతరులపై నెట్టడం అలవాటైందని ఎద్దేవా చేశారు. ''సుప్రీంకోర్టులో సరైన వాదనలు విన్పించే దమ్ములేదు. సీఎంగా రేవంత్ ఉండగానే కదా ప్రభాకర్ రావు విదేశాలకు పారిపోయింది. మరి పారిపోతుంటే ఏం చేశారు? తప్పించుకోవడానికి ఇవన్నీ డ్రామాలాడుతున్నారు. సీఎంను అడుగుతున్నా.. ''నాకు చేతగాదు, నాకు ఆవేశం లేదు. రోషం, పౌరుషం లేదని, కేసీఆర్ కుటుంబాన్ని అరెస్ట్ చేసే దమ్ము అసలే లేదని కేంద్రానికి లేఖ రాయండి. అప్పుడు మేం ఏం చేస్తారో మీరే చూస్తారు.''అని బదులిచ్చారు.

## మూగబోయిన మైకులు.. ప్రచారానికి తెర

* **ఖాళీ అయిన 'వైన్'షాపులు...?**
* **ప్రలోభాలతో ఇళ్ల తలుపులు తడుతున్న అభ్యర్థులు**
* **ఓటర్లను చివరిగా ప్రసన్నం చేసుకునేందుకు తంటాలు**
* **ఊర్లలో ఉన్న ఓటర్లకు ప్రత్యేక ఆఫర్లు**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల అంకం చివరిదశకు చేరుకుంది. నిన్నటితో ప్రచారానికి తెరపడింది. ఇక పోలింగ్ మాత్రమే మిగిలి ఉంది. ప్రచారానికి చివరిరోజైన సోమవారం తెల్లవారుజాము నుంచే అభ్యర్థులు ప్రచారాన్ని హోరెత్తించారు. ఒక్కరోజులోనే వార్డులు, డివిజన్లను మరోసారి చుట్టేసారు. ఆటోలలో మైకులతో ప్రచారం ఒకవైపు, మద్దతుదారులతో కలిసి ఇంటింటికి వెళ్లి ఓట్లు అభ్యర్థించడం మరోవైపు కన్పించింది. దీంతో ఎన్నికల సందడి అంతా చివరిరోజు అంతా ఇంతా కాదు. సాయంత్రం 5 గంటలకల్లా ప్రచారానికి తెరపడటంతో మైకులన్నీ మూగబోయాయి... కార్యకర్తలంతా ఇళ్లకు చేరుకున్నారు. కాని అసలు విషయమంతా అప్పుడే మొదలైంది. ఇప్పటికే తమకు ఓటు వేసేవారు ఎవరున్నారంటూ లెక్కలేసుకున్న అభ్యర్థులు ఒక లిస్టును తయారు చేసుకుని వారిని ప్రసన్నం చేసుకునేందుకు ప్రలోభాలకు గురిచేసే ప్రయత్నానికి తెరతీశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఇల్లందు, అశ్వారావుపేట మున్సిపాలిటీలతోపాటు కొత్తగూడెం కార్పొరేషన్‌కు రేపు పోలింగ్ జరగనుంది. ఇందుకోసం అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే పోస్టల్ బ్యాలెట్ పూర్తయిందని అధికారులు ప్రకటించారు. మంగళవారం పోలింగ్ సిబ్బంది వారివారి పోలింగ్ సామాగ్రితో వారివారి పోలింగ్ బూత్‌లకు చేరుకోనున్నారు. ఇదంతా ఒక ఎత్తయితే... మరోవైపు అభ్యర్థులు చివరిసారిగా ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు నానాతంటాలు పడుతున్నారు.

*** ఊర్లలో ఉన్న ఓటర్లకు ప్రత్యేక ఆఫర్లు...**

కొత్తగూడెం కార్పొరేషన్, ఇల్లందు, అశ్వారావుపేట మున్సిపాలిటీలలో ఓటుహక్కు కలిగి ఉండి, వివిధ పనుల నిమిత్తం హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు వెళ్లి నివసిస్తున్న ఓటర్లకు స్థానిక అభ్యర్థులు ప్రత్యేక ఆఫర్లు ప్రకటిస్తున్నారు. ఓటు వేయడానికి వచ్చిపోయేందుకు అవసరమైన రవాణా చార్జిలు, ఓటుకు రూ.5 వేల చొప్పున నగదు, మద్యం, బిర్యానితోపాటు కొంతమందికి ఇతర ఆఫర్లను కూడా ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఒక్క ఓటు కూడా వదలకూడదనే ఉద్దేశ్యంతో ఇప్పటికే వారికి ఫోన్లు చేసి రప్పించే ప్రయత్నం చేస్తున్నారు. వేరే ప్రాంతాల్లో ఉన్న ఓటర్లు కూడా పనులు వదులుకుని రావాల్సి ఉండటంతో అభ్యర్థుల ఆఫర్లతోపాటు వారు వారి డిమాండ్లను కూడా అభ్యర్థుల ముందు



పెడుతున్నట్లు సమాచారం. మొత్తానికి ఇతర ప్రాంతాల్లో ఉండే ఓటర్లకు ఈ మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల పుణ్యమా అని వేలల్లో డబ్బులు దక్కే అవకాశం లేకపోలేదు.

*** ప్రలోభాలతో తలుపులు తడుతున్న అభ్యర్థులు**

ఓటర్లను చివరిగా ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు ఆఖరి ప్రయత్నాలు చేస్తున్నారు. ఒక్కో ఓటుకు రూ.500 నుంచి మొదలుకొని రూ.5 వేల వరకు కూడా ఇచ్చేందుకు కొందరు అభ్యర్థులు వెనుకాడటంలేదు. సోమవారం రాత్రి నుండే ఈ పంపిణీ ప్రక్రియ ప్రారంభమైనట్లు పలువురు చెప్తున్నారు. రాత్రి వేళలో అభ్యర్థులు తమ నమ్మకస్తులకు డబ్బులు ఇచ్చి ఓటర్లకు ఇవ్వవలసిందిగా పురమాయించినట్లు సమాచారం. కొన్ని ప్రాంతాల్లో బహిరంగంగానే డబ్బుల పంపిణీ జరుగుతున్నట్లు చర్చించుకుంటున్నారు. ఏ పార్టీ వారు ఎంత ఇస్తున్నారు అనే విషయాలు ఇప్పుడు వార్డులు, డివిజన్లలో హాట్ టాపిక్‌గా మారింది. మాకు డబ్బులొచ్చాయి.. మరి మీకొచ్చాయా అంటూ ఓటర్లు సైతం వారి బంధువులను ఆరాతీస్తున్నారు. ఎవరు డబ్బులిస్తారా అని మరికొందరు ఓటర్లు ఎదురుచూస్తున్నారు. అయితే నిజాయితీగల కొందరు ఓటర్లు మాత్రం మాకు డబ్బులు వద్దు అని, అభివృద్ధే ముఖ్యమని, మాకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేస్తామంటూ ఖరాఖండిగా చెప్తుండటం గమనార్హం.

*** ఖాళీ అయిన 'వైన్'షాపులు..?**

ఎన్నికలకు ముందురోజు మద్యంప్రియులకు పంపిణీ చేసేందుకుగాను అభ్యర్థులు ముందుగానే మద్యం బాటిళ్లను తెప్పించిపెట్టుకున్నట్లు తెలుస్తోంది. ఎన్నికలవేళ వైన్, బార్‌షాపులు మూతపడనుండటంతో ముందస్తుగానే క్వార్టర్, హాఫ్, ఫుల్ బాటిళ్లతోపాటు బీర్ కేస్‌లను కూడా పెద్దమొత్తంలో వారివారి ప్రాంతాలకు తరలించినట్లు సమాచారం. మంగళవారం రాత్రి ఈ మద్యం బాటిళ్లను పంపిణీ చేసి ఓటర్లను తమవైపు తిప్పుకోవాలని పలువురు అభ్యర్థులు ప్రయత్నిస్తున్నారు. కొందరు అభ్యర్థులు ముందస్తుగానే మద్యం బాటిళ్లను కొనుగోలు చేయడంతో కొన్ని వైన్‌షాపుల్లో స్టాక్ దొరకడంలేదని పలువురు మద్యంప్రియులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఓటర్లను మభ్యపెట్టేందుకు అభ్యర్థులు డబ్బులు, మద్యం పంపిణీకి సిద్ధమైన నేపథ్యంలో ఎన్నికల అధికారులు, పోలీస్ అధికారులు ఏవిధంగా వారికి అడ్డుకట్ట వేస్తారనేది వేచిచూడాల్సి ఉంది.

## భారత జట్లకు ఐదు బంగారు పతకాలు



కొలంబోలో జరిగిన సౌత్ ఏషియా సెపక్ టక్రా చాంపియన్‌షిప్‌లో భారత మహిళలు, పురుషుల జట్లు చరిత్ర సృష్టించాయి. ఐదు బంగారు పతకాలు సాధించి అద్భుత విజయాలను నమోదు చేసినట్లు సెపక్ టక్రా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాయింట్ సెక్రటరీ పెరిక సురేష్ తెలిపారు. సెపక్ టక్రా మేనేజ్‌మెంట్ కమిటీ నాయకత్వంలో ఈ లీగ్‌లో వాలీబాల్ వేగంగా ప్రాచుర్యం పొందుతోందని అన్నారు. ప్రధాని మోడీ 'ఖేలో ఇండియా ఖేలో' ఉద్యమ స్ఫూర్తిని సాకారం చేస్తూ భారత ఆటగాళ్లు చారిత్రక విజయం సాధించారని పేర్కొన్నారు. ఈ స్పోర్ట్‌ఇండియాలో మరింత జనాదరణ పొంది, రికార్డుల సృష్టిస్తుందని, యువతలో క్రీడాభిమానం, స్పోర్ట్స్‌మాన్‌షిప్ భావనను వ్యాప్తి చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇటీవల టోక్యోలో జరిగిన 2026 ఏషియన్ గేమ్స్ టెస్ట్ ఈవెంట్‌లోనూ భారత పురుషుల సెపక్ టక్రా జట్టు గోల్డ్ మెడల్ సాధించి దేశానికి గౌరవం తెచ్చింది. ఈ అనూహ్య విజయంపై సౌత్ ఏషియా సెపక్ టక్రా ఆర్గనైజేషన్ అధ్యక్షుడు ఎస్.ఆర్. ప్రేమ్ రాజ్, సెపక్ టక్రా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు శ్రీనివాసులు, ఉమ్మడి కార్యదర్శి పెరిక సురేష్, జనరల్ సెక్రటరీ నరేష్ కుమార్ లు ఆటగాళ్లు, కోచ్‌లు, మేనేజ్‌మెంట్, ఫెడరేషన్ సభ్యులకు అభినందనలు తెలిపారు.ఈ చారిత్రక విజయం సెపక్ టక్రా క్రీడకు బలమైన గుర్తింపు తెచ్చిపెడుతుందని, యువ ఆటగాళ్లకు ప్రేరణగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు.

## నాలుగు సీట్లు గెలవరు.. చైర్మన్ ఎలా అవుతారు

**: వైయస్ శిష్యులం మాట ఇస్తే మడిమ తిప్పం**

*** మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి**





చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీ నాలుగు సీట్లు కూడా గెలవదు.. చైర్మన్ ఎలా అవుతారని మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం చిన్న కొండూరు రోడ్డులో సోమవారం కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ 2018లో కెసిఆర్ గాలిలో సైతం మునుగోడు ప్రాంత ప్రజలు ఎమ్మెల్యేగా గెలిపించాలని, మునుగోడు ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. మునుగోడు ప్రాంతాన్ని ప్రపంచానికి పరిచయం చేశానని గుర్తు చేశారు. రాజీనామా ఫలితంగానే 100పథకాల ఆస్పత్రి, సిసి రోడ్లు, డ్రైనేజీలతో అభివృద్ధి జరిగిందన్నారు. చౌటుప్పల్ ప్రాంతంలో 40వేల జనాభా ఉందని, పరిశ్రమల వల్ల లక్ష జనాభా జీవిస్తున్నారన్నారు. రాబోయే దశాబ్ద కాలంలో 5లక్షల జనాభా వరకు పెరగవచ్చన్నారు. అందుకు అనుగుణంగా స్మార్ట్ సిటీ చేసే విధంగా మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నానన్నారు. కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి 100సార్లు పోటీ చేసిన నాపై గెలవడని, కూసుకుంట్లనా.. ఊసుకండ్లనా అని ఎద్దేవా చేశారు. దేశవ్యాప్తంగా తనను గుర్తిస్తారని, నియోజకవర్గం దాటితే కూసుకుంట్లను గుర్తించే వారే లేరన్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం సోనియా గాంధీతో కొట్లాడాలని గుర్తు చేశారు. కూసుకుంట్ల కేసీఆర్ ముందు కూర్చోవడానికి కూడా భయపడతాడని ఆరోపించారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి ఎలా బ్రతికాడో కోమటిరెడ్డి బ్రదర్స్ కూడా అలాగే బ్రతుకుతారన్నారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి శిష్యులం మాట ఇస్తే మడమ తిప్పమన్నారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ అభివృద్ధి జరగాలంటే అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించుకొని చౌటుప్పల్ మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో ముందు నడపాలన్నారు. హస్తం గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అనంతరం బీఆర్ఎస్ యువజన విభాగం మున్సిపల్ అధ్యక్షుడు తొర్పునూరి నరసింహ గౌడ్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అభ్యర్థులు కొసనం రాకేష్‌రెడ్డి, సుర్వి మంజుల నరసింహ గౌడ్, పల్లె లావణ్య సురేందర్ రెడ్డి, ఇప్ప వెంకటేష్, కొండూరు ధర్మేందర్ గౌడ్, రావుల వసంత స్వామి, కాసర్ల మంజుల శ్రీనివాస్ రెడ్డి, బద్రి గాలయ్య, మొగుదాల పావని రమేష్ గౌడ్, దేప రమ్య రాజు ముదిరాజ్, గోశిక వినయ్, పాక చిరంజీవి, బత్తుల వాణి విప్లవ్ కుమార్, ఊడుగు జ్యోతి రమేష్‌గౌడ్, అంతటి విజయలక్ష్మి బాలరాజు గౌడ్, వెన్ రెడ్డి సంధ్య రాజు, గుగులోతు అరుణ, పిల్లలమర్రి మధుసూదన్, ఎండి హన్ను బాయ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ హాస్టళ్లలో సేఫ్టీ లేదు... క్లారిటీ లేదు !

* **కూకట్‌పల్లిలో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న అక్రమ హాస్టళ్లు**
* **లైసెన్సులు లేవు... నాణ్యత లేదు**

(ప్రజాస్ఫూర్తి, కూకట్ పల్లి) : కూకట్‌పల్లి ప్రాంతంలో ప్రైవేట్ హాస్టళ్లు అడ్డగోలుగా వెలుస్తున్నాయి. అనుమతులు, నిబంధనల మాటేమో గానీ, కనీస భద్రత, ఆహార నాణ్యత కరువైంది. ధనార్జనే ధ్యేయంగా కొన్ని యాజమాన్యాలు ఈ హాస్టళ్లను ఏర్పాటు చేస్తున్నారు. వాటిపై పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.




**ఎన్ ఓ సి లు హుళ్ళక్కెనా..?**

కూకట్‌పల్లి జోన్ వ్యాప్తంగా జీహెచ్‌ఎంసీ, ఫుడ్ సేఫ్టీ, ఫైర్ సేఫ్టీ వంటి కీలక అనుమతులు తప్పనిసరి. అయా శాఖల నుంచి ఖచ్చితంగా ఎన్ ఓ సి లు తీసుకోవాలి. కానీ ఇక్కడ అవేమి లేకుండానే భవనాలను అద్దెకు తీసుకుని హాస్టళ్లు ఏర్పాటు చేస్తున్నారు. గతంతో పోలిస్తే ఇటీవల కాలంలో ఈ హాస్టళ్ల దందా విపరీతంగా పెరిగిపోయింది. కోచింగ్ సెంటర్లు, విద్యా సంస్థలు, వ్యాపార కేంద్రాలు, సాఫ్ట్‌వేర్ కంపెనీలు అధికంగా ఉన్న కూకట్‌పల్లి వంటి ప్రాంతాల్లో ప్రైవేట్ వసతి గృహాలు ఇష్టారాజ్యంగా వెలుస్తున్నాయి.

*** లాభమే లక్ష్యం... నాణ్యత గాలికి**

వేల రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ, హాస్టళ్లలో కనీస ఆహార నాణ్యత పాటించడం లేదని అక్కడ నివసిస్తున్నవారు వాపోతున్నారు. గడువు ముగిసిన ఆహార పదార్థాలు, కుళ్లిపోయిన కూరగాయలను వంటల్లో వినియోగించిన ఘటనలు గతంలో పలుమార్లు వెలుగులోకి వచ్చాయి. అయినా పరిస్థితిలో మార్పు కనిపించడం లేదు.

*** లైసెన్సులు లేకుండానే నిర్వహణ**

గతంలో అధికారులు నిర్వహించిన దాడుల్లో పలు ప్రైవేట్ హాస్టళ్లు, ఫుడ్ లైసెన్స్ లేకుండానే నడుస్తున్నట్లు తేలింది. అప్పుడప్పుడు జరిగే తనిఖీల్లో విస్తుపోయే నిజాలు బయటపడుతున్నాయి. వంటగదుల్లో బల్లులు, బొద్దింకలు తిరుగుతున్న సంఘటనలు వెలుగుచుస్తున్నాయి. అంతే కాకుండా, వంట చేసే వారు, పనివాళ్లు గుట్కా, పాన్‌మసాలా, తంబాకు వాడుతూ వంటలు చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. వంటగదులలో ఎక్కడపడితే అక్కడ పాన్ ఉమ్మిన మరకలు ఉన్నా యాజమాన్యాలు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. టాస్క్‌ఫోర్స్ అధికారులు నోటీసులు జారీ చేసినప్పటికీ, తదుపరి చర్యలు లేకపోవడంతో నగరంలో ప్రైవేట్ హాస్టళ్ల దందా మూడు పువ్వులు, ఆరు కాయలుగా వర్ధిల్లుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

*** బాధితుల్లో అధిక శాతం నిరుద్యోగులే**

ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్న ఈ హాస్టళ్లలో వసతులు మాత్రం అరకొరగానే ఉన్నాయని బాధితులు చెబుతున్నారు. ఫ్యాన్లు సరిగా పనిచేయకపోవడం, తాగునీటి సమస్యలు, పరిశుభ్రత లోపించడం, గదుల్లో గాలి-వెలుతురు సరిపడకపోవడం వంటి సమస్యలు నిత్యకృత్యంగా మారాయి. వీటిలో నివసిస్తున్నవారిలో అధిక శాతం నిరుద్యోగ యువత, తక్కువ ఆదాయం కలిగిన వారే. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు రావడానికి కూడా వీలు లేకుండా ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి అక్రమ ప్రైవేట్ హాస్టళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, నిబంధనలు పాటించని హాస్టళ్లను మూసివేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## ఎయిర్‌పోర్టులో చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసిన సచిన్



ఆంధ్రప్రదేశ్: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనలో ఒక ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. కేంద్ర మంత్రులతో సమావేశం కోసం ఢిల్లీ వెళ్లిన చంద్రబాబును క్రికెట్ దిగ్గజం, భారతరత్న సచిన్ టెండూల్కర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఢిల్లీ విమానాశ్రయంలో వీరిద్దరి మధ్య ఈ భేటీ జరిగింది. వివరాల్లోకి వెళితే, రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ పర్యటన చేపట్టారు. ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు పార్టీ ఎంపీలు ఘన స్వాగతం పలికారు. అనంతరం, ఎయిర్‌పోర్టులోని లాంజ్‌లో ఎంపీలతో కలిసి ఆయన కొద్దిసేపు సమావేశమయ్యారు. అదే సమయంలో విమానాశ్రయంలో ఉన్న సచిన్ టెండూల్కర్.. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా అక్కడే ఉన్నారని తెలుసుకున్నారు. వెంటనే ఆయన వద్దకు వచ్చి మర్యాదపూర్వకంగా పలకరించారు. ఇద్దరు ప్రముఖులు కాసేపు ఆప్యాయంగా మాట్లాడుకున్నారు. ఇది పూర్తిగా ఊహించని, మర్యాదపూర్వక భేటీ అని తెలుస్తోంది. ఎంపీలతో సమావేశం, సచిన్‌తో సంభాషణ ముగిసిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీలోని 1 జన్ పథ్‌లో ఉన్న తన అధికారిక నివాసానికి బయలుదేరి వెళ్లారు. తన పర్యటనలో భాగంగా ఆయన పలువురు కేంద్ర మంత్రులతో సమావేశమై రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై చర్చించనున్నారు.

# 39 రోజుల్లో 18.20 లక్షల మంది.. నాంపల్లి నుమాయిష్‌కు పోటెత్తిన జనం

హైదరాబాద్ : నాంపల్లి నుమాయిష్ కేవలం షాపింగ్ వేదికే కాదు. ఇదొక సాంస్కృతిక, సంప్రదాయాల మేళవింపు. దేశం నలుమూలల నుంచి రకరకాల సంప్రదాయాలకు చెందిన కళాకృతులు ఒకే వేదికపై కొలువు తీరుతాయి. 88 ఏండ్లుగా కొనసాగుతున్న ఈ వారసత్వ వాణిజ్య వేడుకకు లక్షలాది మంది తరలివచ్చి తమ అభిరుచికి తగినట్లుగా వస్తువులను కొనుగోలు చేసి మురిసిపోతుంటారు.

**20 లక్షలు దాటే అవకాశం..**

ఈ ఏడాది జనవరి 1న ప్రారంభమైన ఎగ్జిబిషన్ ఆదివారం (ఫిబ్రవరి 8) నాటికి 39 రోజులు పూర్తి చేసుకున్నది. ఇప్పటివరకు 18.20 లక్షల మంది నుమాయిష్‌ను సందర్శించారు. ఆదివారం ఒక్కరోజే 90 వేల మందికిపైగా ఎగ్జిబిషన్‌ను తిలకించడం గమనార్హం. మరో వారం పాటు కొనసాగనున్న నుమాయిష్ ఫిబ్రవరి 15న ముగియనుంది. అప్పటివరకు సందర్శకుల సంఖ్య 20 లక్షలు దాటే అవకాశం ఉంది. ఈ వారంతంలో రెండో శనివారం, ఆదివారం వరుస సెలవులు కావడంతో మరింత మంది ఎగ్జిబిషన్‌కు తరలిరానున్నారు.

**1938లో 100 స్టాళ్లతో ప్రారంభమై..**

నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ప్రతి ఏటా జనవరి 1 నుంచి నుమాయిష్ వేడుకలా జరుగుతుంది. 1938లో 100 స్టాళ్లతో ప్రారంభమైన ఈ ఎగ్జిబిషన్ సందడి ఏ యేటికాయేడు తన ప్రత్యేకతను సంతరించుకుంటున్నది. ఈఏడాది



88వ పడిలోకి అడుగుపెట్టిన నుమాయిష్‌లో.. దేశవ్యాప్తంగా తరలివచ్చిన వ్యాపారులతో 1050 స్టాళ్లు కొలువుదీరాయి. ఇక పిల్లలకు కావాల్సిన ఎంజాయ్ మెంట్ కూడా ఓ రేంజ్‌లో ఉన్నది. ఆహార పదార్థాల నుంచి గృహోపకరణాల వరకు ఇక్కడ దొరకని వస్తువంటూ లేదు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు వివిధ రాష్ట్రాలకు చెందిన వస్తువులు అందుబాటులో ఉన్నాయి. వివిధ రకాల వెరైటీలు, డిజైన్లతో పాటు పలు ప్రాంతాలకు సంబంధించిన కళాకృతులు, ప్రత్యేక వస్తువులు ఇక్కడ లభించడం విశేషం. అదేవిధంగా బ్యాంకింగ్, బీమా తదితర పెద్దపెద్ద సంస్థలు కూడా ఇక్కడ స్టాళ్లు ఏర్పాటు చేసి వ్యాపారం పెంచుకునే ప్రయత్నాలు చేస్తున్నాయి.

### సీఎంల వద్దకు మేం వెళ్లం..

## వాళ్లే మా దగ్గరికి వస్తారు: అక్బరుద్దీన్




కరీంనగర్: తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం ముగిసింది. అంతకు ముందు కరీంనగర్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎంఐఎం నేత అక్బరుద్దీన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సీఎంల దగ్గరకు తాము వెళ్లమని, వాళ్లే తమ వద్దకు వస్తారని అన్నారు. ''రెడ్డి అయినా.. రావు అయినా మా దగ్గరికి రావాల్సిందే. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో మా మద్దతు లేనిదే కాంగ్రెస్ గెలిచిందా? ఈ మున్సిపల్ ఎన్నికల్లో ఎంఐఎం బ్రదర్స్ సత్తా ఏంటో చూపిస్తాం'' అని వ్యాఖ్యానించారు.

## సింగరేణిని రక్షించేది భాజపా మాత్రమే

**: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి**



గోదావరిఖని: సింగరేణి సంస్థ అప్పుల ఊబిలో విలవిలాడుతోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓటేయాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గోదావరిఖనిలోని గాంధీ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. ''బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు తెలంగాణకు అన్యాయం చేశాయి. రామగుండం ప్రాంత అభివృద్ధి కోసం గత ప్రభుత్వం చేసిందేమీ లేదు. ఇక్కడ ఎరువుల కర్మాగారం, పవర్ ప్రాజెక్టు తెచ్చింది భాజపా. కేంద్ర ప్రభుత్వం పెట్టుబడులు పెడుతుంటే బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు దోచుకుంటున్నారు. రామగుండంలో భాజపాను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తాం. రూ.20వేల కోట్లతో ఎన్టీపీసీని విస్తరిస్తాం. సింగరేణిని రక్షించుకోకపోతే మూతపడే ప్రమాదముంది. కార్మికుల శ్రమను ప్రభుత్వం దోచుకుంటోంది. తెలంగాణలో కారు పంక్చర్ అయింది. ఆ పార్టీలో ఉన్న నాయకులు తలో దారి చూసుకున్నారు. బీఆర్ఎస్‌లో జరిగిన అవినీతిపై కేసీఆర్ కుమార్తె కవిత కూడా చెబుతున్నారు. నిరుద్యోగులకు నెలకు రూ.4వేలు ఇస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఎవరికైనా ఇచ్చారా? కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా అమలు కాలేదు. రౌడీయిజం, గూండాయిజంపై ఆ పార్టీ బతుకుతోంది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతోనే మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు నడుస్తున్నాయి. కేంద్రం నిధులతోనే రాష్ట్రంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. సింగరేణిని రక్షించేది భాజపా మాత్రమే. కోల్‌బెల్ట్ ప్రాంతంలో కాషాయ జెండా ఎగిరితేనే సింగరేణికి మనుగడ ఉంటుంది. గతంలో బీఆర్ఎస్‌కు చెప్పిన విధంగా ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పాలి. ఈ ఎన్నికల్లో భాజపా అభ్యర్థులను ప్రజలు గెలిపించాలి'' అని కిషన్‌రెడ్డి కోరారు.





## డిజిటల్ క్రాప్ సర్వే కేంద్ర, రాష్ట్ర పథకాల అమలుకు ఉపకరిస్తుంది

**: సి ఎస్ రామకృష్ణారావు**

హైదరాబాద్: రాష్ట్రంలో డిజిటల్ క్రాప్ సర్వే ప్రక్రియను మార్చి 15వ తేదీలోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ సలహాదారుడు, అగ్రిస్టాక్ చీఫ్ నాలెడ్జ్ ఆఫీసర్ రాజీవ్ చావ్లా అధ్యక్షతన జరిగిన సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి లోకేశ్‌కుమార్, వ్యవసాయశాఖ కార్యదర్శి సురేంద్రమోహన్, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ స్పెషల్ సెక్రెటరి రాజీవ్‌గాంధీ హన్మంతు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ తాము సూచించిన గడువులోగా డిసిఎస్ ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లు, ఎన్ ఐ సి అధికారుల సహకారంతో సర్వేను పూర్తి చేయాలని సూచించారు. సీజినల్ డిజిటల్ క్రాప్ సర్వేతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలకు ఉపకరిస్తుందని, అదేవిధంగా స్థూల రాష్ట్ర దేశీయ ఉత్పత్తి (జిఎస్‌డిపి) గణాంకాలకు ఈ సర్వే ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 10, 877 గ్రామాల్లో డిసిఎస్ సర్వే చేపట్టడం జరిగిందని అధికారులు తెలిపారు. దేశంలోని యుపి, బీహార్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కర్నాటక, ఒడిశా తదితర రాష్ట్రాల్లో డిజిటల్ క్రాప్ సర్వే ప్రక్రియ పూర్తి అయిందని కేంద్ర ప్రభుత్వ సలహాదారుడు రాజీవ్ చావ్లా వెల్లడించారు. అదే తరహాలో తెలంగాణ రాష్ట్రంలో కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. వ్యవసాయశాఖ సంచాలకులు గోపి ఇప్పటి వరకు చేపట్టిన డిజిటల్ క్రాప్ సర్వే వివరాలను ఉన్నతాధికారులకు వివరించారు.

## 'ఈ పొట్టోడు పీకిందేముంది రెండేళ్లల?'

## రేవంత్‌పై కేటీఆర్ ఘాటు విమర్శలు



హైదరాబాద్: భూపాలపల్లి జిల్లాను రద్దు చేస్తానన్న సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. జయశంకర్ సార్ పేరు మీద కేసీఆర్ జిల్లాను ఏర్పాటు చేస్తే.. ఈ రెండేళ్లలో ఈ పొట్టోడు పీకిందేముందంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. భూపాలపల్లి మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించిన రోడ్‌షోలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన సీఎం రేవంత్ రెడ్డిపై, కాంగ్రెస్ పాలనపై అత్యంత ఘాటుగా విమర్శలు చేశారు. ''నిన్న వచ్చి చెబుతున్నడు రేవంత్ రెడ్డి.. భూపాలపల్లి జిల్లాను తీసేయడట.. అది నువ్వు పెట్టినావారా తీసేస్తాందుకు? జయశంకర్ సారు పేరు మీద జిల్లాను పెట్టింది, అభివృద్ధి చేసింది కేసీఆర్. మరి ఈ పొట్టోడు పీకిందేమున్నది రెండేళ్లల? పెద్ద పోజులు కొట్టుకుంట వచ్చి నేను తీసెయ్య అంటవా.. జిల్లాను రద్దు చేస్తే భూపాలపల్లోళ్లు ఊకుంటరా? నీ ఈపు చింతపండు అయితదని తెలుసుకో..'' అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగారు.

*** అభివృద్ధి చేసింది ఎవరు?**

భూపాలపల్లిని జిల్లా చేసి కలెక్టర్, ఎస్పీ ఆఫీసులను తెచ్చింది కేసీఆర్ అని కేటీఆర్ గుర్తుచేశారు. ఇక్కడ మెడికల్ కాలేజీని స్థాపించి, పేదలకు వెయ్యి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, సింగరేణి క్వార్టర్లు కట్టించింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. కేసీఆర్ ఉన్నప్పుడు డిసెంబర్‌లోనే రైతుబంధు పడేదని, ఇప్పుడు ఫిబ్రవరి వచ్చినా దిక్కులేదని ఎద్దేవా చేశారు.

*** లక్కీ డ్రా సీఎం - బూతుల సీఎం**

రేవంత్ రెడ్డి లక్కీ డ్రాలో సీఎం అయిన వ్యక్తి అని, పాలన చేతకాక కేసీఆర్‌ను తిడుతూ కాలం గడుపుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. ''ఎన్నికల్లో గెలిస్తే తులం బంగారం ఇస్తానని అబద్ధాలు చెప్పిండు. ఇప్పుడు మొఖం బాగోలేక అద్దం పగులగొట్టినట్లుగా రేవంత్ తీరు ఉంది. రేవంత్ అంత నీచంగా మాట్లాడే ముఖ్యమంత్రి చరిత్రలో ఎవరూ లేరు. ఆయనొక బూతుల సీఎం'' అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

*** సింగరేణిలో స్కాములు.. బామ్మర్దికి కాంట్రాక్టులు**

కాంగ్రెస్ వచ్చాక సింగరేణిని నిండా ముంచిందని కేటీఆర్ ఆరోపించారు. ''లాభాల్లో ఉన్న సింగరేణిని రెండేళ్లలో నష్టాల్లోకి నెట్టారు. సీఎం తన బావమరిదితో కలిసి రూ.6,000 కోట్ల బొగ్గు స్కామ్ చేశారు. దీనిపై మేము ఆధారాలతో సహా బయటపెట్టినా కేంద్రం చర్యలు తీసుకోవడం లేదు'' అని విమర్శించారు. ఓటుకు నోటు కేసులో ఆధారాలు దొరకకూడదని ఫోరెన్సిక్ ల్యాబ్‌లో నిప్పు పెట్టి తగులబెట్టిన చరిత్ర రేవంత్‌దని దుయ్యబట్టారు.

*** పోలీసులకు హెచ్చరిక**

రేవంత్ మాటలు విని ప్రతిపక్షాలను ఇబ్బంది పెడుతున్న కొంతమంది పోలీసు అధికారుల తీరుపైనా కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, తమ కార్యకర్తలను ఇబ్బంది పెడితే వదిలిపెట్టమని, అతిగా ప్రవర్తించే అధికారుల తోకలు కట్ చేస్తామని హెచ్చరించారు.

*** కారు గుర్తుకు ఓటేసి బుద్ధి చెప్పాలి**

రేవంత్ రెడ్డికి ఓటుతోనే కర్రుకాల్చి వాత పెట్టాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ''బూతుల ముఖ్యమంత్రికి పోలింగ్ బూత్‌లోనే బుద్ధి చెప్పాలి. ఎల్లుండి జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలి. రెండేళ్ల తర్వాత రాష్ట్రంలో ఎగిరేది గులాబీ జెండానే'' అని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

### సీఎం రేవంత్‌కు పొంచిఉన్న పదవీ గండం..

## ఆ మంత్రి వల్లేనన్న సీపీఐ నారాయణ



హైదరాబాద్ : సీఎం రేవంత్ రెడ్డికి పదవీ గండం పొంచి ఉన్నదని సీపీఐ సీనియర్ నేత నారాయణ అన్నారు. ఆ ముప్పు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితోనే ఏర్పడుతుందని చెప్పారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీలో ఇంటింటికి తిరుగుతూ సీపీఐ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో ఉన్న పొత్తులను కాదని కాంగ్రెస్ ఒంటెత్తు పోకడలకు పాల్పడిందని విమర్శించారు. ఐదేండ్ల క్రితం పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఏ పార్టీలో ఉన్నారో తెలుసుకోవాలన్నారు. పార్టీలు మారే నాయకులకు ప్రజల్లో గుర్తింపు ఉండదని మండిపడ్డారు. ఖమ్మం జిల్లా కమ్యూనిస్టులకు కంచుకోట అని చెప్పారు. కమ్యూనిస్టులు తల్లిపాల వంటివారని తెలిపారు. తల్లి పాలకు, డబ్బా పాలకు మధ్య ఈ పోటీ జరుగుతున్నదని వ్యాఖ్యానించారు. కొత్తగూడెం కార్పొరేషన్‌లో సీపీఐ గెలిస్తే ముఖ్యమంత్రి పదవి పోతుందా? అని ప్రశ్నించారు. మొత్తం మున్సిపాలిటీలు కాంగ్రెస్‌కే దక్కాలనే రాజకీయ దురుద్దేశంతోనే పొత్తులు కుదరనీయలేదని విమర్శించారు. సమస్యలు పరిష్కరించే వారికే ఓటేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.


### వ్యవసాయ కూలీల పిల్లలకు

## యూజీ కోర్సుల్లో 15 శాతం సీట్లు: వీసీ అల్దాస్ జానయ్య



హైదరాబాద్ : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం బోధన, పరిశోధన, విస్తరణ అంశాలలో విశ్వవిద్యాలయం అనేక చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకొని అమలు చేస్తుందని ఉప కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య తెలిపారు. సోమవారం విశ్వవిద్యాలయంలో స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తొలిసారిగా వ్యవసాయ కూలీల పిల్లలకు యూజీ కోర్సుల్లో 15 శాతం సీట్లు ప్రత్యేకంగా కేటాయించామన్నారు. ప్రత్యేక కోటా సీట్ల ఫీజు రూ. 10 లక్షల నుంచి రూ. 5 లక్షలకు తగ్గించినట్లు తెలిపారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం ద్వారా 1200 గ్రామాల్లోకి వెళ్లి లక్షా 20 వేల మంది రైతులని నేరుగా కలిసామన్నారు. నూతనంగా కొడంగల్, నిజామాబాద్, హుజూర్ నగర్ లలో వ్యవసాయ కళాశాలలని ప్రారంభించామని, వెస్ట్రన్ సిడ్నీ యూనివర్సిటీ సహా అనేక అంతర్జాతీయ సంస్థలతో కలిసి పని చేస్తున్నామన్నారు. దీంతో విశ్వవిద్యాలయం ర్యాంక్ 37నుంచి 24కు పెరిగిందని, ఐకార్, రాష్ట్రప్రభుత్వాల నిరంతర సహకారం తో విశ్వవిద్యాలయాన్ని అత్యున్నత స్థానానికి తీసుకుని వెళ్ళడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ మెగా స్నాతకోత్సవంలో 2135 మంది అండర్ గ్రాడ్యుయేట్స్, 480 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్స్, 129 మందికి పీ హెచ్ డీ పట్టాలు అందచేశారు. ఆరుగురు పీ హెచ్ డీ అభ్యర్థులు, 26 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్స్, 64 మంది అండర్ గ్రాడ్యుయేట్స్ లకు బంగారు పతకాలు అందచేశారు. స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రసంగం చేసిన అంతర్జాతీయ వ్యవసాయ రంగ నిపుణులు డాక్టర్ ప్రభు పింగళి కి గౌరవ డాక్టరేట్ ప్రధానం చేశారు. అనంతరం వారు ప్రసంగిస్తూ అత్యంత ప్రతిభాశాలి జానయ్య నేతృత్వంలో విశ్వవిద్యాలయం మంచి ప్రగతి సాధిస్తోందని అభినందించారు. 1960లలో ఆహార కొరత ఎదుర్కొన్న భారత దేశం హరిత విప్లవంతో నేడు ఆహార ఉత్పత్తులని ఎగుమతి చేసే స్థాయికి ఎదిగిందని వివరించారు. పప్పు ధాన్యాలు, తృణ ధాన్యాల ఉత్పత్తి లో వెనుకబడి ఉన్నామన్నారు. ఈ కారణంగా అధిక సంఖ్యాక ప్రజలలో పౌష్టికాహార లోపం ఉందని అన్నారు. అదే విధంగా ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రజల ఆహార అలవాట్లలో అనేక మార్పులు వచ్చాయని, పాశ్చాత్యుల ఆహారపు అలవాట్లు మన వారికి అలవడుతున్నాయన్నారు.

# స్పీకర్ ఓం బిర్లాపై విపక్షాల అవిశ్వాస తీర్మానం..?



పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య వాగ్వాదంతో ఉభయ సభల కార్యకలాపాలకు తరచూ అంతరాయం కలుగుతోంది. సభలో తమను మాట్లాడనివ్వడం లేదని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం తీసుకొచ్చేందుకు విపక్షాలు యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పీటీఐ కథనం వెల్లడించింది. అవిశ్వాస తీర్మానం తెచ్చేందుకు ఇప్పటికే విపక్షాలు నోటీసులిచ్చినట్లు సమాచారం. త్వరలోనే ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది. అయితే, దీనిపై స్పందించేందుకు కాంగ్రెస్ నిరాకరించింది. తమ చర్య కోసం వేచిచూడాలని పేర్కొంది. రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో ప్రసంగించేందుకు విపక్ష నేత రాహుల్ గాంధీని స్పీకర్ అనుమతించలేదని ప్రతిపక్షాల ప్రధాన ఆరోపణ. ఇక, కాంగ్రెస్ ఎంపీలు, మహిళా నేతలను కించపరిచేలా మాట్లాడిన భాజపా ఎంపీ నిషికాంత్ దూబేపై స్పీకర్ ఎలాంటి చర్యలు తీసుకోలేదని, అందుకే ఈ అవిశ్వాస తీర్మానం తీసుకొస్తున్నట్లు తెలుస్తోంది. ఈ తీర్మానం తీసుకురావాలంటే కనీసం 100 మంది ఎంపీల సంతకాలు అవసరం. ప్రస్తుతం విపక్షాలు ఆ సంతకాల సేకరణలో ఉన్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కార్యాలయంలో సోమవారం ఉదయం జరిగిన సమావేశంలో అవిశ్వాస తీర్మానంపై నిర్ణయం తీసుకున్నట్లు సదరు వర్గాలు పేర్కొన్నాయి. కాంగ్రెస్ నేతృత్వంలో జరిగిన ఈ భేటీలో టీఎంసీ, డీఎంకే, వామపక్షాలు, సమాజ్‌వాదీ పార్టీ, ఆర్జేడీ, శివసేన (యూబీటీ), ఎన్సీపీ (ఎస్పీ) తదితర పార్టీలు పాల్గొన్నట్లు తెలిపాయి. మరోవైపు, పార్లమెంట్‌లో సోమవారం కూడా సభ కార్యకలాపాలకు ఆటంకం కలిగింది. విపక్షాల నిరసనలతో లోక్‌సభ పలుమార్లు వాయిదా పడింది. అటు రాజ్యసభలో ఖర్గే ప్రసంగానికి అనుమతి లభించకపోవడంతో విపక్షాలు సభ నుంచి వాకౌట్ చేశాయి.

## రూ.54వేల కోట్లు కొల్లగొట్టారు..
### ఇది భారీ దోపిడీ: డిజిటల్ మోసాలపై సుప్రీం



దేశంలో డిజిటల్ అరెస్టు మోసాలు పెరిగిపోవడంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ కేసుల్లో సైబర్ నేరగాళ్లు రూ.54వేల కోట్లు కొల్లగొట్టారని, ఇది భారీ దోపిడీ అంటూ ఆందోళన వ్యక్తంచేసింది. దోచుకున్న సొమ్ము చిన్నరాష్ట్రాల బడ్జెట్ కంటే ఎక్కువగా ఉందని పేర్కొంది. ఈ మోసాలపై అత్యున్నత న్యాయస్థానంలో తాజాగా విచారణ జరిగింది. వాటికి చెక్ పెట్టేందుకు ఆర్‌బీఐ, బ్యాంకులు, టెలికమ్యూనికేషన్ విభాగం సంప్రదింపులతో నిర్ణీత ప్రమాణాల కార్యాచరణను రూపొందించాలని కేంద్రాన్ని ఆదేశించింది. అందుకు నాలుగువారాల గడువు ఇచ్చింది. ఈ నేరాలకు కొందరు బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం, కుట్ర కూడా కారణం కావొచ్చని తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఆర్‌బీఐ, బ్యాంకుల నుంచి సకాలంలో చర్యలు ఉండాలని ఆదేశించింది. డిజిటల్ అరెస్టు కేసుల్లో పరిహారం విషయమై ఆర్‌బీఐ, టెలికమ్యూనికేషన్ విభాగం, ఇతర విభాగాలు సంయుక్తంగా సమావేశంకావాలని సూచించింది. తదుపరి విచారణను నాలుగువారాలకు వాయిదా వేసింది. ఇదిలా ఉంటే.. డిజిటల్ ఆర్థిక మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో, బ్యాంకింగ్ వినియోగదార్లకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)ఉపశమనాన్ని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఒక మోసపూరిత లావాదేవీకి రూ.25,000 వరకు పరిహారాన్ని అందివ్వనుంది. మోసగాళ్లకు వన్ టైం పాస్‌వర్డ్ (ఓటీపీ) ఇవ్వడం ద్వారా, డబ్బులు పోగొట్టుకున్న వారికీ ఈ పరిహారం అందుతుందని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు. అయితే ఆ లావాదేవీలు దురుద్దేశంతో కూడుకున్నవి కాకుండా ఉండాలన్నారు.

## రైళ్లలో ఫుడ్ ఆర్డర్ ఈజీ.. ఇ-ప్యాంట్రీ సేవలకు శ్రీకారం




ప్రయాణికుల సౌకర్యార్థం భారతీయ రైల్వే కొత్త సదుపాయం తీసుకొచ్చింది. రైల్లో ఫుడ్ ఆర్డర్ చేసేందుకు ఇప్యాంట్రీ సదుపాయాన్ని ఐఆర్‌సీటీసీ ప్రవేశపెట్టింది. తొలుత వివేక్ ఎక్స్‌ప్రెస్‌లో ఈ సేవలను ప్రారంభించగా.. 25 మెయిల్/ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ఈ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్యాంట్రీ కారు కలిగిన ఎంపిక చేసిన రైళ్లలో ఈ సేవలను పొందొచ్చు. కన్ఫమ్ టికెట్, ఆర్ఏసీ, పాక్షికంగా టికెట్ కన్ఫమ్ అయిన ప్రయాణికులు ఇప్యాంట్రీ ద్వారా ప్రీ ఆర్డర్ చేసుకోవచ్చు. ప్యాంట్రీ కార్ స్టాఫ్ సీటు దగ్గరకే ఆహారాన్ని డెలివరీ చేస్తారు. ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ లేదా యాప్‌లో 'బుక్డ్ టికెట్ హిస్టరీ' సెక్షన్‌లో ఇప్యాంట్రీ మీల్ ఆప్షన్ కనిపిస్తుంది. మీల్ బుక్ చేసుకున్నాక మీల్ వెరిఫికేషన్ కోడ్ వస్తుంది. దాన్ని డెలివరీ సమయంలో చూపించాలి. విశాఖ నుంచి వెళ్లే ఏపీ ఎక్స్‌ప్రెస్ కూడా ఈ జాబితాలో ఉంది. దశలవారీగా మిగిలిన రైళ్లకూ విస్తరించనున్నారు. కీ ఫీచర్లు: ఇ ప్యాంట్రీ ద్వారా స్టాండర్డ్ లేదా రైల్‌నీర్‌ను బుక్ చేసుకోవచ్చు. ట్రైన్ ఎక్కాక ఆహారం కోసం ఆలోచన చేయాల్సిన అవసరం తప్పుతుంది. డిజిటల్ మోడ్‌లో చెల్లింపులు చేయొచ్చు. ఆన్‌లైన్‌లో మీరు ఫుడ్ బుక్ చేసుకోగానే మీకు మీల్ వెరిఫికేషన్ కోడ్ అందుతుంది. మీల్ ఆర్డర్ నుంచి డెలివరీ వరకు ట్రాకింగ్ ఉంటుంది. ఏదైనా కారణంతో ఫుడ్ డెలివరీ అవ్వకపోతే ఆ సమాచారం కూడా ఎస్సెమ్మెస్/ ఇమెయిల్ ద్వారా సమాచారం వస్తుంది. ఆన్‌లైన్‌లోనే రిఫండ్ అయిపోతుంది.

## తరగతి గదిలో కాల్పులు..విద్యార్థిని మృతి



తరగతి గదిలో ఓ విద్యార్థి తన తోటి విద్యార్థినిని తుపాకీతో కాల్చిన ఘటన పంజాబ్‌లోని తరన్ తారన్ జిల్లాలో చోటుచేసుకుంది. ఈ ఘటనతో అక్కడున్న విద్యార్థులంతా భయభ్రాంతులకు గురయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ విద్యార్థి తన తోటి విద్యార్థినిని తరగతి గదిలో తుపాకీతో కాల్చాడు. ఈ ఘటనలో ఆమె అక్కడికక్కడే మృతిచెందగా.. కాల్పులకు పాల్పడిన విద్యార్థి కూడా అదే తుపాకీతో కాల్చుకున్నాడు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానిక ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు పేర్కొన్నారు. హత్యకు గల కారణాలు తెలియరాలేదు. వారిద్దరూ న్యాయవిద్య ప్రథమ సంవత్సరం చదువుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## 'సర్' ప్రక్రియ కొనసాగాల్సిందే..
## ఎలాంటి అడ్డంకులు కల్పించవద్దు: సుప్రీంకోర్టు



బెంగాల్‌లో నిర్వహిస్తోన్న 'సర్' కసరత్తును వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీం ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. సర్ ప్రక్రియలో ఏవైనా ఆదేశాలు, స్పష్టత అవసరమైతే తాము కల్పించుకుంటామని పేర్కొంది. అంతేకానీ సర్ ప్రక్రియలో అడ్డంకులు కల్పించే ప్రయత్నాలు చేయవద్దని బెంగాల్ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. ఈ విషయాన్ని అన్ని రాష్ట్రాలు అర్థం చేసుకోవాలని వ్యాఖ్యానించింది. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ(సర్) కోసం 300మంది అధికారులను కేటాయించాలని బెంగాల్ ప్రభుత్వాన్ని కోరితే..80 మంది గ్రేడ్ 2 స్థాయి అధికారులనే కేటాయించిందని న్యాయస్థానానికి ఈసీ తెలియజేసింది. మరోవైపు ఎన్నికల సంఘం అధికారులు రాష్ట్రాన్ని లక్ష్యంగా చేసుకున్నారని, అర్హులైన ప్రజలను ఓటర్ల జాబితాల్లో చేర్చడం లేదని బెంగాల్ ప్రభుత్వం పేర్కొంది. ఇంటి పేర్లలో అక్షరదోషాలు, వివాహం తర్వాత మహిళల చిరునామాలలో మార్పు వంటి చిన్న లోపాలను సాకుగా చూపి.. ఓట్లు తొలగిస్తున్నారని ధర్మాసనానికి తెలిపింది. దీనివల్ల 1.36 కోట్ల మంది ఓటర్లు ప్రభావితమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తంచేసింది. తమ స్థానికతను నిరూపించుకోవడానికి ఓటర్లకు ఈసీ ఒక్క అవకాశమూ ఇవ్వలేదని బెంగాల్ సర్కార్ న్యాయస్థానానికి తెలియజేసింది. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ రాష్ట్రంలో ఓటర్ల దరఖాస్తులు పూర్తి చేయడానికి, డేటాను ఖరారు చేయడానికి గడువును ఒక వారం పొడిగిస్తున్నట్లు వెల్లడించింది.

### హిమంత వ్యాఖ్యలపై చట్టపరంగా
## ముందుకెళ్తాం: గౌరవ్ గొగోయ్




తమ కుటుంబానికి పాకిస్థానీ ఏజెంట్ అలీ తౌఖీర్ షేక్‌తో సంబంధాలు ఉన్నాయని అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ చేసిన వ్యాఖ్యలపై లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష ఉపనేత గౌరవ్ గొగొయ్ స్పందించారు. 2013లో తన పాక్ పర్యటనపై సిట్ అధికారులు తనను ఎన్నడూ ప్రశ్నించలేదన్నారు. ప్రజల మధ్యలో మతపరమైన విద్వేషాలు సృష్టించేందుకు హిమంత ఓ వర్గాన్ని లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు. తన భార్య, మైనర్ పిల్లలపై అసంబద్ధమైన ఆరోపణలు చేసినందుకుగాను అస్సాం సీఎం వ్యాఖ్యలపై చట్టపరంగా ముందుకు వెళ్తామన్నారు. ఆయన మాట్లాడిన వీడియో ఆధారంగా కేసు నమోదు చేయాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. గతంలో తన భార్య పాకిస్థాన్‌కు వెళ్లడం నిజమేనని.. కానీ వృత్తి సంబంధమైన పనిలో భాగంగా అక్కడికి వెళ్లాల్సి వచ్చిందని అన్నారు. ఆమెతో పాటు తాను కూడా 10 రోజుల పాటు పాక్‌కు వెళ్లినట్లు తెలిపారు. ఈ పర్యటన సమయంలో తాను అక్కడ ఎవరినీ కలవలేదన్నారు. ఆ విషయంపై హిమంత బిశ్వశర్మ అర్థం లేని, నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు.

## కాన్పూర్ లగ్జరీకారు ప్రమాదం..
## ఎఫ్ఐఆర్ నుంచి వ్యాపారి కుమారుడి పేరు మిస్..!





ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పూర్‌లో పాదచారులపైకి లంబోర్గిని కారు దూసుకెళ్లడంతో పలువురు తీవ్ర గాయాలపాలైన విషయం తెలిసిందే. ఈ ప్రమాదం జరిగిన సమయంలో కారును నడిపిన శివం అనే యువకుడి పేరును పోలీసులు ఎఫ్ఐఆర్‌లో నమోదు చేయలేదని జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఘటనా స్థలంలో ఉన్న లగ్జరీ కారు నుంచి శివంను బయటకు తీస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నా ఎఫ్ఐఆర్‌లో మాత్రం అతడి పేరును నమోదు చేయకపోవడాన్ని స్థానికులు విమర్శించారు. నిందితుడు ప్రముఖ వ్యాపారి కొడుకు కావడం వల్లే అతడిని రక్షించడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. మరోవైపు ఘటనా స్థలంలో పలువురు వ్యక్తులు గాయాలపాలవగా.. పోలీసులు ఆ కారును జాగ్రత్తగా అక్కడినుంచి తరలించినట్లు స్థానికులు పేర్కొన్నారు. అనంతరం లంబోర్గినిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి.. షీట్ కప్పి భద్రపరిచారన్నారు. ఈ ఘటనపై తీవ్ర విమర్శలు రావడంతో తాజాగా శివం మిశ్రా పేరును పోలీసులు ఎఫ్ఐఆర్‌లో చేర్చినట్లు తెలుస్తోంది. అయితే దీనిపై పోలీసులు అధికారికంగా స్పందించాల్సి ఉంది



## గాజియాబాద్ బాలికల ఆత్మహత్య కేసు..
### ముగ్గురు భార్యల 'కథ'తో గందరగోళం!

ఉత్తరప్రదేశ్‌లోని గాజియా బాద్‌లో ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఆత్మహత్య చేసుకున్న కేసులో కొత్త విషయాలు బయటకు వస్తున్నాయి. బాధితుల తండ్రి చేతన్ కుమార్ చెబుతున్న సమాధానాలు వాస్తవాలకు భిన్నంగా ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. తాను వివాహం చేసుకున్న మహిళలు ముగ్గురూ అక్కాచెల్లెళ్లు అని అతడు మొదట పేర్కొన్నాడని తెలిపారు. అయితే దర్యాప్తులో చేతన్ భార్యలు ఒకే కుటుంబానికి చెందినవారు కాదని.. మూడో భార్య టీనా 2018లో అతడి వద్ద ఉద్యోగినిగా పని చేసినట్లు తేలిందన్నారు. అనంతరం వారు వివాహం చేసుకున్నారని.. అప్పటికే చేతన్‌కు రెండు వివాహాలు జరిగాయని అన్నారు. 2010లో సుజాతను వివాహం చేసుకున్నానని.. తమకు పిల్లలు పుట్టకపోవడంతో 2013లో హీనాను వివాహం చేసుకున్నట్లు అతడు విచారణలో పేర్కొన్నాడు. అయితే మొదటి భార్య కుమార్తెకు ప్రస్తుతం 16 ఏళ్ల వయసు ఉండడంతో అతడు చెబుతున్న మాటలపై అధికారులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. దీంతో వివాహ పత్రాల ఆధారంగా ముగ్గురితో చేతన్‌కు ఏ సంవత్సరాల్లో వివాహం జరిగిందనే విషయంపై దర్యాప్తు చేస్తున్నామన్నారు. అంతేకాకుండా, 2015లో చేతన్ సహజీవన భాగస్వామి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ కేసులో దర్యాప్తు చేస్తున్నకొద్దీ చేతన్ వివాహాల విషయంలో కొత్త విషయాలు బయటకు వస్తుండడంతో విచారణలో గందరగోళం నెలకొందని అధికారులు పేర్కొన్నారు. మరోవైపు వారు ట్రిబుల్ బెడ్‌రూం ఫ్లాట్‌లో నివసిస్తున్నప్పటికీ ఘటన జరిగిన సమయంలో అందరూ ఒకే గదిలో నిద్రించడం అనుమానాస్పదంగా ఉందన్నారు. ఆర్థిక సమస్యలు, అప్పుల కారణంగా కొన్నేళ్ల క్రితమే తమ పిల్లలను స్కూల్ మానిపించినట్లు చేతన్ చెప్పడం, వారు ఆత్మహత్య చేసుకోవడానికి కొన్ని రోజుల ముందు వారి ఫోన్లను విక్రయించడం కూడా పలు అనుమానాలకు దారితీస్తోంది. దీంతో ఆ ఫోన్‌లలో ఉన్న సమాచారాన్ని తెలుసుకునేందుకు వాటి ఐఎంఈఐ నంబర్ల సాయంతో రికవరీ చేస్తున్నట్లు తెలిపారు.



# తెలుగు రాకున్నా మేనేజ్ చేస్తున్నా

## వారిణాసి హీరోయిన్ ప్రియాంక

టాకీస్: రాజమౌళి-మహేష్ బాబుల క్రేజీ కాంబోలో వస్తున్న 'వారణాసి' సినిమా ఇప్పటికే బాక్సాఫీస్ వద్ద ప్రకంపనలు సృష్టిస్తోంది. సుమారు రూ. 1300 కోట్ల భారీ బ్జడెట్తో తెరకెక్కుతున్న ఈ గ్లోబ్ ట్రాటింగ్ యాక్షన్ అడ్వెంచర్లో ప్రియాంక చోప్రా ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. మహేష్ బాబు 'రుద్ర'గా కనిపిస్తుండగా, విలన్ పాత్రలో పృథ్వీరాజ్ సుకుమారన్ నటిస్తున్నారు. అయితే ఈ మూవీ గురించి ఎలాంటి చిన్న వార్త వచ్చిన కూడా నిమిషంలో వైరల్ అవుతుంది. ఇందులో భాగంగా తాజాగా అంతర్జాతీయ మీడియాతో మాట్లాడిన ప్రియాంక, ఈ సినిమాలో నటించడం తన కెరీర్లోనే ఒక విభిన్నమైన అనుభవమని పేర్కొన్నారు. ముఖ్యంగా.. తెలుగు భాష రాకపోవడం తనను ఇబ్బంది పెట్టినప్పటికీ, రాజమౌళి సహకారం తో దాన్ని అధిగమిస్తున్నట్లు తెలిపారు. ప్రియాంక చోప్రా మాట్లాడుతూ.. 'వారణాసి సినిమాలో నటించడం నాకు ఒక పెద్ద ఛాలెంజ్గా మారింది. నిజం చెప్పాలి అంటే నాకు తెలుగు అస్సలు రాదు, అర్థం కూడా కాదు. కేవలం డైలాగులను అక్షరాలా గుర్తుపెట్టుకుని పలుకుతున్నాను. సెట్లో ఒక్కసారిగా డైలాగ్స్ మారిస్తే నాకు చాలా కష్టమవుతుంది. అలాంటి సమయంలో రాజమౌళి సర్ నాకు అండగా నిలుస్తారు. ప్రతి మాట అర్థం, భావం వివరించి అది ఏ టోన్లో చెప్పాలో ఆయన వివరంగా చెబుతారు. కొన్నిసార్లు డైలాగ్ అర్థం చేసుకోవడానికి పది నిమిషాలు సమయం తీసుకుని, నా స్టైల్లో చెప్పే ప్రయత్నం చేస్తాను. ఇది నాకు ఒక అదనపు పెర్ఫార్మెన్స్ లేయర్ లాంటిది' అని వివరించారు. తన తోటి నటుడు పృథ్వీరాజ్కు కూడా తెలుగు రాదని, కానీ తనకంటే ఆయనే కొంచెం బెటర్ అని ప్రియాంక సరదాగా వ్యాఖ్యానించారు.

# 14న పెద్ది సెకండ్ సింగిల్ విడుదల

టాకీస్: మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, ఉప్పెన దర్శకుడు బుచ్చిబాబు సానా కాంబినేషన్లో తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'పెద్ది' పై ప్రేక్షకుల్లో రోజురోజుకీ అంచనాలు పెరుగుతున్నాయి. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ సింగిల్ 'చికిరి చికిరి' మ్యూజిక్ లవర్స్ను విపరీతంగా ఆకట్టుకుని ఆడియో ప్లాట్ఫామ్స్లో సెన్సేషన్ క్రియేట్ చేయగా, ఇప్పుడు అందరి దృష్టి సినిమా నుంచి రాబోతున్న సెకండ్ సింగిల్ పై పడింది. ఈ చిత్రానికి ఆస్కార్ విజేత త్సాహం నింపారు. వాస్తవానికి ఈ పాటను డిసెంబర్ చివర్లో విడుదల చేయాలనుకున్నప్పటికీ, పలు కారణాల వల్ల వాయిదా పడింది. ప్రస్తుతం ఫిబ్రవరి 14న వాలెంటైన్స్ డే సందర్భంగా విడుదల చేయాలని మేకర్స్ ఎ÷-లాన్ చేస్తున్నట్టు సమాచారం. అధికారిక ప్రకటన ఈ వారంలో వెలువడే అవకాశముందని సినీ వర్గాలు సూచిస్తున్నాయి. భారీ బ్జడెట్తో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ జాన్వీ కపూర్ కథానాయికగా



ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండటం సినిమాకు మరింత ప్రత్యేక ఆకర్షణగా మారింది. తాజా సమాచారం ప్రకారం, రెండో పాట ఒక పవర్ఫుల్ ఇంట్రడక్షన్ సాంగ్ గా ఉండనుందని తెలుస్తోంది. రామ్ చరణ్ పాత్రను గ్రాండ్గా ఎలివేట్ చేసే ఈ పాటకు ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ అదిరిపోయే స్టెప్పులు డిజైన్ చేసినట్లు టాక్ వినిపిస్తోంది. ఈ సాంగ్లో చరణ్ మాస్ ఎనర్జీ, స్టైల్ అభిమానులను అలరిస్తుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. దర్శకుడు బుచ్చిబాబు సానా స్వయంగా సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ ఈ పాట గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'ఈ సాంగ్ ఖచ్చితంగా ఒక బ్లాస్ట్ లా ఉ ంటుంది' అంటూ అభిమానుల్లో మరింత ఉ నటిస్తోంది. అదేవిధంగా కన్నడ స్టార్ శివ రాజ్కుమార్, సీనియర్ నటుడు జగపతి బాబు, బాలీవుడ్ నటుడు దివ్యేందు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంతో కూడిన స్పోర్ట్స్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రం భావోద్వేగాలు, యాక్షన్, సంగీతం మేళవింపుతో ఉండబోతోందని తెలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఏప్రిల్ 30 న ఈ సినిమాను గ్రాండ్గా విడుదల చేయడానికి చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ సాంగ్తోనే సినిమాపై భారీ హైప్ ఏర్పడగా, రాబోయే సెకండ్ సింగిల్ ఆ అంచనాలను మరింత పెంచేలా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# 11న నెట్ఫ్లిక్స్లో అనగనగా ఒకరాజు



టాకీస్: నవీన్ పొలిశెట్టి 'అనగనగా ఒక రాజు'.. సంక్రాంతి కానుకగా.. జనవరి 14న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి విజయంతో పాటు కలెక్షన్స్ కూడా సాధించింది. ఈ సినిమాకు మారి దర్శకత్వం వహించగా.. సితార ఎంటర్టైన్ మెంట్స్ నిర్మించిన ఈ మూవీలో మీనాక్షి చౌదరి హీరోయిన్గా నటించింది. ఈ మూవీ ప్రముఖ ఓటీటీ ప్లాట్ఫామ్ నెట్ఫ్లిక్స్లో స్ట్రీమింగ్కు సిద్ధంగా ఉంది. ఫిబ్రవరి 11నుండి ఈ సినిమా అందుబాటులోకి రానున్నట్లు నెట్ఫ్లిక్స్ అఫీషియల్గా అనౌన్స్ చేసింది. 'రాజుగారి పెళ్లంటే ఏడు తరాలు అటు ఇటు గుర్తుండిపోవాలి' అని స్పెషల్ పోస్టర్ షేర్ చేశారు.

# 'గాయపడ్డ సింహం' ట్రైలర్ రిలీజ్?

టాకీస్: నూతన తరహా సినిమాలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు తరుణ్ భాస్కర్ మరోసారి వార్తల్లో నిలిచారు. 'పెళ్లి చూపులు'తో టాలీవుడ్కు న్యూ ఏజ్ కథనం ఎలా ఉండాలో చూపించిన ఆయన, 'ఈ నగరానికి ఏమైంది' సినిమాతో కల్ట్ ఫాలోయింగ్ సంపాదించారు. దర్శకుడిగానే కాకుండా నటుడిగానూ వరుస చిత్రాలతో బిజీ అవుతున్న తరుణ్ భాస్కర్ ఇప్పుడు 'గాయపడ్డ సింహం' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ చిత్రానికి కశ్యప్ శ్రీనివాస్ దర్శకత్వం వహించగా, ఫరియా అబ్దుల్లా, మానసా చౌదరి కథానాయికలుగా నటించారు. దర్శకుడు పవన్ సాధినేని సమర్పకుడిగా వ్యవహరించడం విశేషం. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమాకు సంబంధించిన టీజర్, ట్రైలర్ కలిపిన "ట్రైజర్" ను తాజాగా విడుదల చేశారు. విడుదలైన ట్రైజర్కు సోషల్ మీడియాలో మంచి స్పందన లభిస్తోంది. కామెడీ, వ్యంగ్యం, యాక్షన్ అంశాలను కలగలిపి సరదాగా రూపొందించినట్లు




కనిపిస్తోంది. కథాంశం విషయానికి వస్తే? అమెరికా వెళ్లాలని కలలు కనే ఓ యువకుడి జీవితంలో చోటుచేసుకునే సంఘటనల చుట్టూ సినిమా తిరుగుతుంది. వీసా రిజెక్ట్ కావడంతో అతడు ఎదుర్కొనే నిరాశ, ఫ్రస్ట్రేషన్, ఆ తర్వాత తీసుకునే నిర్ణయాలు కథకు ప్రధానాంశాలుగా ఉ ంటాయని ట్రైజర్ ద్వారా అర్థమవుతోంది. మధ్య మధ్యలో వచ్చే యాక్షన్ ఎపిసోడ్లు, కేజీఎఫ్ స్పూఫ్ సన్నివేశాలు, అమెరికా వెళ్లకపోయినా హీరో ఇచ్చే బిల్డప్ డైలాగులు వినోదాన్ని పంచుతున్నాయి.



# మృణాళ్ చుట్టూ పెళ్లి రూమర్లు

టాకీస్: బాలీవుడ్ నటి మృణాల్ ఠాకూర్ ఈ మధ్య కాలంలో డేటింగ్, పెళ్లి రూమర్లతో హాట్ టాపిక్గా నిలుస్తున్నారు. ఈ రూమర్స్ మధ్య బాలీవుడ్ హీరో చేసిన పని హాట్ టాపిక్గా మారింది. యంగ్ హీరో సిద్ధాంత్ చతుర్వేది మృణాల్పై పూల వర్షం కురిపించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. మృణాల్ ఠాకూర్, సిద్ధాంత్ చతుర్వేది కలిసి నటించిన తాజా చిత్రం 'దో దీవానే షెహర్ మే' ప్రమోషన్లలో భాగంగా ఈ జంట ఒక ఈవెంట్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈవెంట్ వేదిక బయట ఫొటోగ్రాఫర్లతో మాట్లాడుతున్న మృణాల్పై సిద్ధాంత్ గొడుగులో నింపుకుని తెచ్చిన పూలతో అకస్మాత్తుగా పూల వర్షం కురిపించాడు. దీనికి మృణాల్ ఇచ్చిన స్మైల్ రియాక్షన్ నెటిజన్లను ఆకట్టుకుంది. అక్కడితో ఆగని సిద్ధాంత్, అదే ప్రమోషనల్ ఈవెంట్ స్టేజ్పైనా మరోసారి మృణాల్పై పూలు చల్లాడు. ఈ రెండు ఘటనలకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుండటంతో వీరిద్దరి మధ్య ఏదైనా ప్రత్యేక బంధం ఉందా అనే చర్చలు మొదలయ్యాయి. అభిమానులు, నెటిజన్లు తమదైన శైలిలో కామెంట్లు చేస్తూ ఊహాగానాలు పెంచుతున్నారు. మరోవైపు మృణాల్ ఠాకూర్ తమిళ స్టార్ హీరో ధనుష్తో డేటింగ్లో ఉ ందనే వార్తలు కూడా కొంతకాలంగా వినిపిస్తున్నాయి. ఫిబ్రవరి 14న వీరిద్దరి పెళ్లి జరుగుతుందనే రూమర్లు వచ్చినప్పటికీ మృణాల్ టీమ్ వాటిని ఖండించింది. అవి కేవలం పుకార్లేనని స్పష్టం చేసింది. అయినప్పటికీ ఈ డేటింగ్ వార్తలు మాత్రం పూర్తిగా చల్లారలేదు. సిద్ధాంత్తో మృణాల్ తరచుగా కలిసి కనిపించడం కూడా కొత్త చర్చలకు దారితీస్తోంది. అయితే వీరిద్దరూ కలిసి సినిమా చేస్తున్న కారణంగా ప్రమోషన్లలో భాగంగానే కలుస్తున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి. 'దో దీవానే షెహర్ మే' చిత్రం ఫిబ్రవరి 20న ప్రేక్షకుల ముందుకు రానుండగా, అడివి శేష్తో కలిసి నటించిన తెలుగు సినిమా 'డెకాయిట్' ఏప్రిల్ 10న విడుదలకు సిద్ధమవుతోంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.